జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు
9440231967, 7989694528

రంగారెడ్డి సోమవారం 23 ఫిబ్రవరి 2026 సంపుటి : 1 సంచిక : 55 వెల: రూ.5 పేజీలు: 08 RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from RANGAREDDY, WARANGAL, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com



# చంద్రబాబుకు సహకరించలే..

## కాళేశ్వరాన్ని వదిలేయం వాడుకలోకి తెస్తాం

## రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తిచేస్తాం

- భూసేకరణే అసలు సమస్య... ఫలితంగా అంచనాలు పెరిగాయి..
- పది సంవత్సరాలు పాలించిన వారు
- ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు..
- ఎన్ని ఇబ్బందులెదురైనా భూసేకరణ కోసం ప్రత్యేక కార్పస్ ఫండ్
- దేవాదుల కోసం జూన్ 2లోపు రూ.600 కోట్లు ఇస్తామని వెల్లడి
- దేవాదుల ప్రాజెక్టును పరిశీలించిన సీఎం, మంత్రులు

వరంగల్

తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం మహా అద్భుతం అన్నారని.. తాము వచ్చినప్పటి నుంచి ఒక్క చుక్క ఎత్తిపోయలేదని చెప్పారు. అయినా దేశంలోనే అత్యధిక వరి ఉత్పత్తి జరిగిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును వదిలేయకుండా ఉపయోగంలోకి తెస్తామని స్పష్టం చేశారు. ఒక్క కాళేశ్వరం పైనే రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు చేసిన గత ప్రభుత్వం మిగతా ప్రాజెక్టులను గాలికొదిలేసిందని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ తప్పిదాల వల్ల కాళేశ్వరం ప్రాజెక్టు దెబ్బతిన్న మాట వాస్తవమే అయినా, వేల కోట్లు ఖర్చు చేసిన ప్రాజెక్టును అలాగే వదిలేయలేమని చెప్పారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా నిపుణుల కమిటీ సూచనల మేరకు కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి స్థాయిలో వాడుకలోకి తెస్తామని ప్రకటించారు. ఆదివారం ఉమ్మడి వరంగల్‌లో పర్యటించిన రేవంత్‌రెడ్డి.. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్కతో కలిసి ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెంలో దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించారు. ఇంటెక్‌వెల్ వద్ద మోటార్లను సందర్శించిన ఆయన.. దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ పాయింట్ వద్ద ఇరిగేషన్ అధికారులతో - మిగతా2లో



## ఆ సదస్సు టర్నింగ్ పాయింట్

- ఏఐ రంగంలో భారత్ అద్భుత విజయాలు
- వాటిని చూసి అధినేతలు ఆశ్చర్యపోయారు
- 'మన్ కీ బాత్'లో




## ట్రంప్ మాస్టర్ ప్లాన్: ఖమేనీ, ఆయన కుమారుడిని అంతం చేసేలా వ్యూహం!

- ఇరాన్ సుప్రీం లీడర్‌ను లక్ష్యంగా చేసుకున్న అమెరికా
- మధ్యప్రాచ్యంలో భారీగా అమెరికా సైనికుల మోహరింపు
- చర్చలకు సిద్ధం.. యుద్ధానికీ సై అంటున్న ఇరాన్
- పరిమిత దాడుల ఆలోచనలో ఉన్నానన్న డొనాల్డ్ ట్రంప్
- పూర్తిస్థాయి యుద్ధానికి దారితీయొచ్చని నిపుణుల హెచ్చరిక

## 2026 ఎన్నికల్లో పెరంబూరు నుంచి పోటీ



## ముందు ప్రజల హృదయాలను గెలవండి



- ప్రధాని పదవిని చేరాలంటే అది అవసరం
- మహిళా ఎంపీలను నా సీటు ఆక్రమణకు పంపిస్తారా?
- విపక్షాలది అంత దొల్లతనమా?: మోదీ
- అత్యంత వేగవంతమైన మెట్రోను యూపీలో ప్రారంభించిన పీఎం

## యూఎస్ పట్టభద్రుల్లో హిందువులే ఎక్కువ

- ప్రతి 10 మందిలో ఏడుగురు పట్టభద్రులు
- స్థానిక అమెరికన్లలో పది మందిలో నలుగురే



# సభకు వెళ్లే పెద్దలెవరు?

- రాష్ట్ర కాంగ్రెస్‌లో రాజ్యసభపై చర్చ... అధిష్టానం కోటాలో సింఘ్వికి రెన్యువల్
- మరో స్థానం కోసం తీవ్ర పోటీ... ఎస్టీ, బీసీ, రెడ్డి సామాజిక వర్గాలకు అవకాశం?
- రేసులో లంబాడా నేత బెల్లయ్య నాయక్
- బీసీ కోటాలో సీనియర్ నేత వీహెచ్‌కు చాన్స్... పరిశీలనలో మధుయాష్కీ పేరు
- ఎమ్మెల్సీ పదవి వదులుకోవాల్సి వస్తే రాజ్యసభకు మహేశ్‌గౌడ్?



హైదరాబాద్


ఈసారి రాష్ట్రం నుంచి పెద్దల సభ కు ఎవరు వెళ్తారన్న చర్చ ఇప్పుడు అధికార కాంగ్రెస్‌లో జోరుగా సాగుతోంది. ప్రస్తుతం రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న అభిషేక్ మను సింఘ్వి (కాంగ్రెస్), కేఆర్ సురేశ్‌రెడ్డి (బీఆర్‌ఎస్)ల పదవీ కాలం ఏప్రిల్ 9తో ముగియనున్న నేపథ్యంలో వారి స్థానంలో ఏర్పడే ఖాళీల భర్తీ కోసం కేంద్ర ఎన్నికల కమిషన్ ఇటీవల షెడ్యూల్ విడుదల చేసింది. ఈ షెడ్యూల్ ప్రకారం వచ్చే నెల 5లోపు నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంది. అసెంబ్లీలో బలాబలాల ప్రకారం ఈ రెండు స్థానాలు ఈసారి కాంగ్రెస్ పార్టీకి వచ్చే అవకాశాలుండటంతో అధికార పార్టీ ఎవరిని రాజ్యసభకు పంపుతుందన్నది - మిగతా2లో

# లొంగిపోయిన దేవ్‌జీ!

- రాజిరెడ్డి సహా 16 మందితో కలిసి ఆయుధాలు వీడిన మావో అగ్రనేత
- కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఎస్ఐబీ పోలీసుల ఎదుట లొంగుబాటు
- దీనిపై తమకు సమాచారం ఉందన్న ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం
- ఇంకా ధ్రువీకరించని తెలంగాణ పోలీసు ఉన్నతాధికారులు..
- కేంద్రం చేపట్టిన ఆపరేషన్ కగార్ లక్ష్యం ఇక నెరవేరినట్లేనని చర్చ



తిప్పిరి తిరుపతి



మల్లా రాజిరెడ్డి

భద్రాద్రి కొత్తగూడెం

మావోయిస్టు పార్టీ అగ్రనేత, నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ తర్వాత ఆ పార్టీకి నాయకత్వం వహిస్తున్న తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ ఎట్టకేలకు అజ్ఞాతం వీడినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శిగా కొనసాగుతున్న ఆయన కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఎస్ఐబీ పోలీసుల ఎదుట లొంగిపోయారని విశ్వసనీయ సమాచారం. ఆయనతోపాటు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్ సహా 16 మంది సహచరులు లొంగిపోయినట్లు తెలిసింది. ఇదే విషయాన్ని ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం, ఆ రాష్ట్ర హోం మంత్రి విజయ్‌శర్మ ఆదివారం రాయ్‌పూర్‌లో మీడియా సమావేశంలో వెల్లడించారు. దేవ్‌జీ, సంగ్రామ్ లొంగిపోయినట్లు తమకు సమాచారం ఉందన్నారు. అయితే ఈ వార్తలను తెలంగాణ పోలీసులు ఇంకా ధ్రువీకరించలేదు. కాగా, దేవ్‌జీ లొంగుబాటు వార్తల నేపథ్యంలో కేంద్రం సాగిస్తున్న ఆపరేషన్ కగార్--2 లక్ష్యం ఇక నెరవేరినట్లేనన్న చర్చ నడుస్తోంది. తిప్పిరి తిరుపతి స్వస్థలం జగిత్యాల జిల్లా - మిగతా2లో

# సభకు వెళ్లే పెద్దలెవరు?


-మొదటిపేజీ తరువాయి
చర్చనీయాంశమవుతోంది. అయితే, ఈ రెండింటిలో ఒకటి అధిష్టానం కోటాకు వెళ్లనుంది. తెలంగాణకు సంబంధించిన కీలక కేసుల్లో న్యాయవాదిగా ఉన్న ఆ పార్టీ నేత సింఘ్వీని రాష్ట్రం నుంచి మరోమారు పెద్దల సభకు పంపే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇక, రెండో స్థానం కోసం తీవ్ర పోటీ నెలకొంది. రాష్ట్ర కాంగ్రెస్‌లోని పలువురు నేతలు ఎవరికి వారు రాజ్యసభ కోసం ప్రయత్నాలు చేసుకుంటుండగా, ఈసారి రెడ్డి, బీసీ, ఎస్టీ వర్గాల్లో ఒకరికి చాన్స్ ఉందనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది.

**ఎవరిని పంపుతారో?**

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రెండు దఫాలుగా ముగ్గురిని (రేణుకా చౌదరి, అనిల్‌కుమార్ యాదవ్, అభిషేక్ సింఘ్వి) రాజ్యసభకు పంపింది. ఈ జాబితాలో రేణుకా చౌదరి, అనిల్‌కుమార్ యాదవ్, అభిషేక్ సింఘ్వి ఉన్నారు. సింఘ్వికి రెన్యువల్ కావడం దాదాపు ఖరారు కాగా, రెండో సభ్యుడిగా రాష్ట్రం నుంచి రెడ్డి, బీసీ లేదంటే ఎస్టీ వర్గాల నేతల పేర్లను పరిగణనలోకి తీసుకునే అవకాశాలున్నాయి. ముఖ్యంగా మంత్రివర్గంలో స్థానం లేని లంబాడా సామాజిక వర్గానికి ఈ సీటు కేటాయించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

రాష్ట్రంలో గణనీయ సంఖ్యలో ఓటర్లున్న లంబాడా సామాజిక వర్గానికి మంత్రివర్గంలో స్థానం లేకపోవడం, ఇప్పటివరకు నల్లగొండ జిల్లాకు చెందిన శంకర్‌నాయక్‌ను మాత్రమే ఎమ్మెల్సీగా నియమించడం, కార్పొరేషన్ చైర్మన్ల విషయంలో పెద్దగా ప్రాధాన్యం కల్పించని నేపథ్యంలో ఈసారి బంజారా నాయకుడిని పెద్దల సభకు పంపే విషయాన్ని తీవ్రంగా పరిశీలిస్తున్నట్టు సమాచారం.

ఈ కోటాలో తెలంగాణ ఉద్యమకారుడు, ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర మాజీ చైర్మన్, ప్రస్తుత ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. తెలంగాణ ఉద్యమకారుడిగా ఆయనకు అటు బంజారా సామాజిక వర్గంలోనూ, ఇటు రాజకీయ వర్గాల్లోనూ గుర్తింపు కూడా ఉంది. సీఎం రేవంత్ ఆశీస్సులు కూడా ఆయనకున్నాయని, రాహుల్ కోటరీలో తనకున్న సంబంధాలతో ఈసారి తనకు అవకాశం ఇవ్వాలని బెల్లయ్య ఢిల్లీలో ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇదే సామాజికవర్గం నుంచి



మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ పేరు కూడా వినిపిస్తోంది.

**రేసులో పలువురు**

సామాజిక సమీకరణల్లో భాగంగా బీసీలకు మరో అవకాశం ఇచ్చే అంశాన్నీ కాంగ్రెస్ పరిశీలిస్తోంది. ఈ జాబితాలో మాజీ ఎంపీ వి.హనుమంతరావు, అధిష్టానంతో సన్నిహిత సంబంధాలున్న టీపీసీసీ ప్రచార కమిటీ మాజీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ పేర్లు వినిపిస్తున్నాయి. మరోవైపు దేశవ్యాప్తంగా సామాజిక న్యాయం అంశాన్ని ఎజెండాగా చేసుకుని వెళుతున్న కాంగ్రెస్... బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు సముచిత ప్రాధాన్యం ఇస్తోందని, ఇప్పటికే పలు కీలక స్థానాల్లో ఆయా వర్గాల నేతలను నియమించిన నేపథ్యంలో ఈసారి రాజ్యసభకు అగ్రవర్ణాలకు చెందిన నాయకులను పంపుతారనే చర్చ కూడా జరుగుతోంది. ఇందులో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేతల పేర్లు తెరపైకి వస్తున్నాయి. రేవంత్‌కు అత్యంత సన్నిహితుడు, ఆయన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి పేరు ఈ జాబితాలో ప్రముఖంగా వినిపిస్తోంది. ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి కూడా ఇప్పటికే ఢిల్లీ పెద్దలను కలిసి తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఇక, రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి కూడా తన సేవలకు గుర్తింపుగా పెద్దల సభకు పంపుతారని ఆశిస్తున్నారు. జగిత్యాల నియోజకవర్గ రాజకీయ పరిణామాల్లో అసంతృప్తితో ఉన్న సీనియర్ నేత టి.జీవన్‌రెడ్డి పేరును కూడా పార్టీ పరిశీలిస్తున్నట్టు సమాచారం. వీరితో పాటు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, ఉప రాష్ట్రపతిగా ఇండియా కూటమి నుంచి పోటీ చేసిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పేరు కూడా వినిపిస్తున్నా ఆయన రాజకీయ అడుగు వేస్తారా అన్నది తేలాల్సి ఉంది. అయితే, ఆయన్ను ఒప్పించేందుకు రేవంత్‌రెడ్డి యత్నిస్తున్నారనే చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది. ఇక, మరో ట్విస్ట్ ఏమిటంటే.. టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ గౌడ్ పేరు కూడా రాజ్యసభ రేసులో వినిపిస్తోంది. మంత్రిగా అజహరుద్దీన్ బాధ్యతలు స్వీకరించి నాలుగు నెలలు కావస్తోంది. మరో రెండు నెలల్లో ఆయన ఎమ్మెల్సీ లేదంటే ఎమ్మెల్యేగా ఎన్నిక కావాల్సి ఉంటుంది. కానీ, ఆయనను ఎమ్మెల్సీగా నియమించే విషయం ఇప్పటివరకు ఎటూ తేలలేదు. ఈ నేపథ్యంలో అవసరమైతే మహేశ్‌గౌడ్‌ను రాజ్యసభకు పంపి, ఆయన స్థానంలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీగా అజహరుద్దీన్‌ను ఎంపిక చేసే అవకాశాలను కూడా పార్టీ పరిశీలిస్తున్నట్టు సమాచారం.

# విద్యార్థి దశ నుంచి విప్లవంలోకి..

కోరుట్ల

అణచివేతకు ఎదురొడ్డి.. భూస్వాముల దమనకాండను నిలదీసి.. అణగారిన వర్గాల్లో విప్లవ జ్వాలలు రగిలించిన తిప్పిరి తిరుపతి అలియాసదేవ్‌జీ రాడికల్ విద్యార్థి సంఘం నాయకుడి నుంచి మావో అగ్రనేతగా ఎదిగారు. కోరుట్లలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన తిరుపతి ఈ ప్రాంతంలో సామాన్య ప్రజానీకం భూస్వాముల అణచివేతపై చిన్నప్పటి నుంచే తిరుగుబావుటా ఎగురవేశారు. 1981లో పదో తరగతి నుంచే ఆయన రాడికల్ విద్యార్థి సంఘం వైపు ఆకర్షితులయ్యారు. ఆర్ఎస్‌యూ క్రియాశీల సభ్యుడిగా పనిచేశారు.

కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివే సమయంలో విద్యార్థుల్లో విప్లవ భావాలను నూరిపోయడంలో కీలకపాత్ర పోషించారు. ఆ సమయంలో ఏబీవీపీ, ఆర్ఎస్‌యూ విద్యార్థి సంఘాల మధ్య గొడవలు, దాడులు తీవ్రమయ్యాయి. పోలీసులు రాడికల్ విద్యార్థి సంఘం నాయకులపై నిఘా పెంచారు. ఇంటర్ పాసైన తిరుపతి 1983--84 సమయంలో కరీంనగర్ ఎస్ఆర్ఆర్ కళాశాలలో డిగ్రీలో చేరారు. అక్కడ ఆర్ఎస్‌యూ కార్యకలాపాల విస్తరణకు ప్రయత్నిస్తున్న క్రమంలో పోలీసుల నిఘా పెరగడంతో 1984 చివర్లో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు.

**గిరాయిపల్లి ఒగ్గు కథ పాత్రధారి..**

వరంగల్‌లోని నాటి రీజనల్ ఇంజనీరింగ్ కాలేజీ (ప్రస్తుత ఎన్ఐటీ)కి చెందిన నలుగురు విద్యార్థులు 1975లో సాయుధ రైతాంగ పోరాట నిర్మాణంలో పాలుపంచుకున్న క్రమంలో మెదక్ జిల్లా గిరాయిపల్లి వద్ద పోలీసులు వారిని చిత్రహింసలకు గురిచేసి చంపేశారు. ఈ ఘటనపై గద్దర్ రచించి పాడిన మల్లన్న, బీరప్ప, కొమురన్న ఒగ్గు కథ ప్రచారంలో తిరుపతి చురుకుగా పాల్గొన్నారు. 1982--83లో గిరాయిపల్లి ఒగ్గుకథను కోరుట్ల జూనియర్ కళాశాల మైదానంలో ప్రదర్శించగా ఒగ్గు కథలో బీరప్ప పాత్రను తిరుపతి పోషించారు. ఈ కథ వినేందుకు కోరుట్లవాసులే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి



పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. ఆ సమయంలో పల్లెల్లో విప్లవ భావాలను రగిలించడంలో గిరాయిపల్లి ఒగ్గు కథకు కీలకపాత్ర పోషించింది. ఈ సభ అనంతరం నుంచి తిరుపతిపై పోలీసుల నిర్బంధం పెరిగింది.

**ఉద్యమ సహచరితో పెళ్లి..**

డిగ్రీ చదువుతున్న సమయంలో అజ్ఞాతంలోకి వెళ్లిన తిరుపతి కుటుంబంలో పెద్దవారు. తమ్ముడు వెంకటి చనిపోగా చిన్నతమ్ముడు గంగాధర్ కోరుట్లలోనే ఉన్నారు. ఆ సమయంలో కోరుట్ల అంబేద్కర్‌నగర్‌లో చిన్నప్పుడే పెళ్లి చేసే సంప్రదాయం ఉండటంతో తిరుపతి తమ్ముళ్లకు చిన్ననాడే వివాహాలు అయ్యాయి. కానీ విప్లవబాట పట్టిన తిరుపతికి మాత్రం పెళ్లి కాలేదు. అజ్ఞాతంలోకి వెళ్లాక మహారాష్ట్రలో మావో ఉద్యమానికి ఊపిరిపోసే పనిలో నిమగ్నమైన క్రమంలో అదే ప్రాంతానికి చెందిన దళ కమాండర్ సృజనను ఆయన వివాహం చేసుకున్నారు. సృజన 2019లో గడ్చిరోలిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారు.

**ఒకే ఒక్క ఫొటో...**

తిరుపతి అజ్ఞాతంలోకి వెళ్లే ముందే తన ఆనవాళ్లు దొరకకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిసింది. ఇంట్లోని ఫొటోలు, కోరుట్ల జూనియర్ కళాశాల, ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాలలోని ఫొటోలు ఎవరికీ చిక్కకుండా చేశారు. ఆయన అజ్ఞాతంలోకి వెళ్లినప్పటి నుంచి పోలీసులకు ఫొటోలు దొరకలేదు. దీంతో ఆయన ఆనవాళ్లు తెలుసుకోవడం కష్టంగా మారింది. మావోయిస్టుగా వివిధ హోదాల్లో కొనసాగిన సమయంలోనూ ఆయన ఫొటోలేవీ బయటకు రాలేదు. 1995లో దండకారణ్యంలో జరిగిన ఓ ప్లీనరీ సమావేశానికి హాజరైనప్పుడు ఒకరు తీసిన ఓ ఫొటోనే పోలీసులకు దొరికింది. ఇప్పటికీ ఆయన ఆనవాళ్ల కోసం ఆ ఫొటోనే అందుబాటులో ఉంది.

# ఏఐసీసీకి ఏటీఎంలా తెలంగాణను మార్చినట్లు సీఎం ఒప్పుకొన్నారు: కేటీఆర్

హైదరాబాద్

ఏఐసీసీకి తెలంగాణను ఏటీఎంలా సీఎం రేవంత్‌రెడ్డి మార్చారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. గత రెండేళ్లుగా ఈ విషయాన్ని చెబుతున్నామని, ఇప్పుడు రేవంత్‌రెడ్డి స్వయంగా ఒప్పుకొన్నారని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటనను విడుదల చేశారు. 'రాష్ట్ర సంపదను కాంగ్రెస్ అధిష్ఠానానికి రేవంత్‌రెడ్డి ధారపోస్తున్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీ వీధుల్లో తాకట్టు పెడుతున్నారు. రైతులు, మహిళలు, యువత, విశ్రాంత ఉద్యోగులకు ఇచ్చిన 420 హామీల అమలుకు నిధులు లేవని సాకులు చెబుతున్నారు. రాష్ట్ర అభివృద్ధికి నిధులు లేవంటున్న ప్రభుత్వం.. ఈ రెండేళ్లలో అప్పుగా రూ.3 లక్షల కోట్లను తెచ్చింది. రాష్ట్రంలో ఒక్క ఇటుకను కూడా పేర్చిన దాఖలాలు లేవు. ప్రజల సొమ్మును ప్రజాప్రయోజనాలకు వాడకుండా పక్కదారి పట్టిస్తున్నారు. మూసీ సుందరీకరణ పేరిట పేదల ఇళ్లను, లగచర్ల గిరిజన భూములను, చివరకు హెచ్‌సీయూ



విశ్వవిద్యాలయ భూములను కూడా వదలడం లేదు. హిల్ట్ పాలసీ పేరిట పరిశ్రమల భూములను లూటీ చేస్తున్నారు. రేవంత్‌రెడ్డి తన పదవిని కాపాడుకోవడం, ఢిల్లీకి సంచులు మోయడమే ఏకైక ఎజెండాగా పెట్టుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి' అని కేటీఆర్ పేర్కొన్నారు.

## చంద్రబాబుకు సహకరించలే..

-మొదటిపేజీ తరువాయి
సమీక్ష నిర్వహించారు. అనంతరం రేవంత్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడానికే తమపై ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 80 వేల పుస్తకాలు చదివామని చెబుతున్న జ్ఞానవంతులు ఆనాడు 960 టీఎంసీలకు సరిపడా ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. రెండు మూడేళ్లలో ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి తెలంగాణను సస్యశ్యామలం చేస్తామన్నారు.

**భూసేకరణే అసలు సమస్య...**

ప్రాజెక్టులు పూర్తి చేయడానికి భూసేకరణే అసలు సమస్యగా మారిందని, ఫలితంగా ప్రాజెక్టుల అంచనాలు కూడా పెరిగాయని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పదేళ్లు పాలించిన వాళ్లు ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే ఈ పరిస్థితి ఉత్పన్నమయ్యేంది కాదన్నారు. ఎన్ని ఇబ్బందులెదురైనా ప్రాజెక్టుల భూసేకరణ కోసం ప్రత్యేక కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తామని, దేవాదుల ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ కోసం జూన్ 2లోపు రూ.600 కోట్లు విడుదల చేస్తామని చెప్పారు. దేవాదుల ప్రాజెక్టు 2001లో రూ.6,000 కోట్ల అంచనాతో ప్రారంభమై ప్రస్తుతం రూ.18,500 కోట్లకు పెరిగిందని, ఆ మేరకు బడ్జెట్‌లోపే అన్ని అంచనాలను ప్రభుత్వం ముందు ఉంచి ఆమోదం తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. మార్చిలో మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేసి అన్ని అంచనాలకు ఆమోదం తెలియజేస్తామన్నారు. అసెంబ్లీ సమావేశాల సమయంలో ఎమ్మెల్యేలు, అధికారులతో దేవాదులపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఒక నెలలోపు దేవాదుల పంపులను మరమ్మతు చేయాలని అధికారులను ఆదేశించారు.

**చంద్రబాబుకు సహకరించలే..**

తెలంగాణ నీటి హక్కులను కాపాడుతూ అన్ని ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న రేవంత్‌రెడ్డి.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, గత ప్రభుత్వం తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. ఏపీ సీఎం చంద్రబాబుకు తాము సహకరిస్తున్నామనే ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. తెలంగాణకు సంబంధించిన నీటి హక్కుల విషయంలో ప్రభుత్వం రాజీ పడదని చెప్పారు. ప్రాజెక్టులపై అసెంబ్లీలో పూర్తిస్థాయిలో చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. బీఆర్ఎస్ నేతలు విమర్శలు కాకుండా సూచనలు ఇస్తే స్వాగతిస్తామని పేర్కొన్నారు. 'అధికారం, పదవులు వారసత్వంగా రావు.. ప్రజలే నిర్ణయిస్తారు.. పదవులు ఎవరి సొత్తు కాదు.. ప్రజల ఆశీస్సులతోనే పదవులు వస్తాయి'అని రేవంత్‌రెడ్డి అన్నారు. 2034 వరకు మరో పదేళ్లు కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, గండ్ర సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

**వెన్నం సోదరులకు సీఎం పరామర్శ**

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ జిల్లాలోని రెడ్యాల గ్రామానికి చెందిన వెన్నం రాఘవేందర్‌రెడ్డి మృతిచెందగా.. సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం వెన్నం సోదరులను పరామర్శించారు. ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా రెడ్యాల గ్రామానికి చేరుకున్న రేవంత్‌రెడ్డి.. రాఘవేందర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళు లర్పించారు. అనంతరం ఆయన కుమారులు రాష్ట్ర సంవిధాన్ బచావో కమిటీ సభ్యుడు వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, బిగ్ టీవీ చైర్మన్ వెన్నం విజయకాంత్‌రెడ్డి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## లొంగిపోయిన దేవ్‌జీ!

-మొదటిపేజీ తరువాయి
కోరుట్ల కాగా, రాజిరెడ్డి పెద్దపల్లి జిల్లాలోని మంథనికి చెందినవారు.

**మా ప్రభుత్వానికి భారీ విజయం**

'కేంద్ర హోంమంత్రి అమిత్ షా రణనీతి, ఛత్తీస్‌గఢ్ సీఎం అవలంబించిన విధానాల కారణంగా మావోయిస్టు పార్టీ మనుగడ అంతిమ దశకు చేరుకుంది. దేవ్‌జీ, సంగ్రామ్‌లు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలోని గడ్చిరోలి, అబూజ్‌మడ్ అడవుల్లో అనేక ఏళ్లుగా పనిచేస్తున్నారు. ఇద్దరు అగ్రనేతల లొంగుబాటు మా ప్రభుత్వానికి భారీ విజయం. కానీ వారిద్దరి కంటే మరో సీనియర్ నేత (ముప్పాళ్ల లక్ష్మణరావు) ఇంకా అజ్ఞాతంలో ఉన్నారు. అయితే ఆయన వయోభారంతో ఉన్నారు. ఆయన ఎక్కడ ఉన్నారనే అంశంపై మాకు స్పష్టత లేదు. అగ్ర నాయకత్వంలో మరో నేత (మిసిర్ బెస్రా) జార్ఖండ్‌లో ఉన్నారు. అజ్ఞాతంలో ఉన్న ఇంకొందరు సాయుధ మావోయిస్టుల విషయంలో ఎలా ముందుకెళ్లాలనే అంశంపై చర్చ జరుగుతోంది. ఇప్పటికే కర్రెగుట్టల్లో భద్రతా దళాలు పెద్ద ఎత్తున గాలింపు చర్యలు చేపడుతున్నాయి. ఈ ఆపరేషన్‌తో మాకు సత్ఫలితాలు వస్తున్నాయి. కర్రెగుట్టల్లో మావోయిస్టులు అమర్చిన 89 ఐఈడీలను నిర?వర్యం చేశాం. మారిన పరిస్థితులను గుర్తించి మిగిలిన వారు కూడా లొంగిపోతే మంచిది. ఎట్టి పరిస్థితుల్లోనూ వచ్చే నెల 31 నాటికి దేశంలో మావోయిస్టులు లేకుండా చేస్తాం'అని ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం విజయ్‌శర్మ చెప్పారు.

**మా కల నిజమైంది: తిరుపతి సోదరుడి కుమార్తె సుమ**

తిరుపతి లొంగుబాటు వార్త తెలియగానే ఆయన సోదరుడు గంగాధర్, ఆయన కుమార్తె సుమ, ఇతర బంధువులు స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. 'పెద్దనాన్న లొంగిపోవాలని ఎన్నో లేఖలు రాశాను. మా ఆవేదనను పెద్దనాన్న అర్థం చేసుకున్నారు. ఏళ్ల తరబడి అడవుల్లో ఉండి అణగారిన వర్గాల అభ్యున్నతికి పనిచేసిన ఆయన.. మా కోసం ఉద్యమాన్ని వీడి లొంగిపోయి వస్తున్నారన్న విషయం తెలియడంతో మా కల నిజమైందని సంబరపడుతున్నాం'అని సుమ చెప్పారు. అలాగే తిరుపతితో కలిసి కోరుట్ల జూనియర్ కళాశాలలో చదువుకున్న బక్కయ్య సైతం హర్షం వ్యక్తం చేశారు.

## ప్రజలతో మమేకమవుతూ పార్టీని బలోపేతం చేద్దాం

హైదరాబాద్



ప్రజలతో మమేకమవుతూ పార్టీని మరింత బలోపేతం చేయాలని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పార్టీ నాయకులు, శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. వికారాబాద్ జిల్లా అనంతగిరిలో తెలంగాణ, ఏపీ డీసీసీ అధ్యక్షుల శిక్షణ శిబిరం ఆదివారం రెండో రోజు కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోదండరాంతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శిక్షణ పొందిన నాయకులు జిల్లాల్లో పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రజలతో సన్నిహితంగా మెలగాలని సూచించారు. డీసీసీ అధ్యక్షులు జిల్లాల్లో పార్టీ నేతలను సమన్వయం చేసే బాధ్యత తీసుకోవాలన్నారు. కష్టపడి పని చేసేవారిని పార్టీ తప్పకుండా గుర్తిస్తుందని, పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. 'సంఘటన సృజన్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక శిక్షణ శిబిరం ద్వారా పార్టీ సంస్థాగత బలోపేతానికి, నాయకత్వ సామర్థ్యాల అభివృద్ధికి దిశానిర్దేశం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. సంఘటన సృజన్ అభియాన్ చైర్మన్ సచిన్‌రావు ఆధ్వర్యంలో.. వంశీచంద్‌రెడ్డి ఆర్గనైజింగ్ సెక్రటరీగా, స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి చైర్మన్‌గా ఈ శిబిరం కొనసాగుతోంది. పది రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో నాయకత్వ నైపుణ్యాలు, ప్రజా సమస్యల పరిష్కార విధానాలు, ఎన్నికల వ్యూహరచన, సోషల్ మీడియా, మీడియా నిర్వహణ, కార్యాచరణ ప్రణాళికలు వంటి కీలక అంశాలపై నిపుణుల ద్వారా శిక్షణ అందిస్తున్నారు.

# ముందు ప్రజల హృదయాలను గెలవండి

మేరఠ్

ప్రధానమంత్రి సీట్లో కూర్చోవాలని తపనపడుతున్నవారు ముందుగా ప్రజల హృదయాలను గెలవాలని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. పార్లమెంటులో ప్రధాని సీటును ఆక్రమించుకోవాలని మహిళా ఎంపీలను ఉసిగొల్పడం ద్వారా ఎవరూ ఆ స్థానాన్ని చేరుకోలేరని స్పష్టంచేశారు. మాతృమూర్తుల్ని, సోదరీమణుల్ని ఇలా పార్లమెంటులో ముందుకు నెట్టేంత దొల్లగా మారిపోయారా అని పరోక్షంగా లోక్‌సభ విపక్షనేత రాహుల్‌గాంధీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. దేశంలోనే అత్యంత వేగంగా గంటకు 120 కి.మీ. వేగంతో వెళ్లే మెట్రోరైలును ఉత్తర్‌ప్రదేశ్‌లోని మేరఠ్‌లో ఆదివారం మోదీ ప్రారంభించారు.

నమో భారత్ రైలును సైతం జెండా ఊపి ప్రారంభించారు. రూ.12,930 కోట్ల ప్రాజెక్టులనూ జాతికి అంకితం చేశారు. యూపీ సీఎం ఆదిత్యనాథ్‌తో కలిసి మెట్రోలో ప్రయాణించి, విద్యార్థులు, అధికారులతో ముచ్చటించారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగించారు.



**కాంగ్రెస్ నగ్నత్వం దేశానికి తెలుసు**

దిల్లీలో నిర్వహించిన ఏఐ సమిట్‌లో యువజన కాంగ్రెస్ కార్యకర్తలు అర్ధనగ్నంగా నిరసన చేపట్టడాన్ని మోదీ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ తన మురికి రాజకీయాలకు వేదికగా దీనిని మార్చుకుందని విమర్శించారు. విదేశీ అతిథులు కూర్చున్న వేదిక వద్దకు కాంగ్రెస్ నాయకులు వచ్చి గందరగోళం సృష్టించారని తెలిపారు. కాంగ్రెస్ నేతలు సైద్ధాంతికంగా దివాలా తీసి, తమ దారిద్ర్యాన్ని చాటుకున్నారని చెప్పారు. "కాంగ్రెస్ నగ్నత్వం దేశానికి తెలుసు. ఇప్పటికే ప్రజల దృష్టిలో ఆ పార్టీ నేతలు దిగజారిపోయారు. ఇంకా ఇలాంటి పనులు చేయాల్సిన అవసరం ఏముంది? దేశాన్ని అప్రతిష్ఠపాలు చేసేపనిలో కాంగ్రెస్ తీరిక లేకుండా ఉంది. రాజకీయ విభేదాల కంటే వ్యక్తిగత శత్రుత్వంపైనే వారు దృష్టి పెడుతున్నారు. గతంలో నన్ను, నా తల్లిని అవమానించారు. ఇప్పుడు ప్రపంచ నేతల ఎదుట దేశాన్ని అవమానించారు. అన్ని పరిమితుల్ని వారు దాటిపోయారు. తమ చర్యలకు సిగ్గుపడాల్సింది పోయి అదొక గొప్పగా ప్రచారం చేసుకుంటున్నారు. దేశాన్ని గొప్పదిగా చేసేందుకు ప్రజలు అహోరాత్రులు కష్టపడుతుంటే, విజయాలు సాధిస్తుంటే కొన్ని పార్టీలు జీర్ణించుకోలేకపోతున్నాయి" అని మండిపడ్డారు. ఇలాంటివాటిని తాను తప్పుపడితే 'విపక్షాలపై విరుచుకుపడ్డ మోదీ' అనే పతాక శీర్షికలు పెట్టొద్దని మీడియాకు విజ్ఞప్తి చేశారు. ఏఐ సదస్సు ఒక అంతర్జాతీయ కార్యక్రమమని, దానిలో భాజపా నేతలెవరూ లేరని చెప్పారు.

**తొలి ఆర్ఆర్‌టీఎస్**

దిల్లీ నుంచి మేరఠ్ మధ్య తిరగనున్న నమో భారత్ రైలు దేశంలోనే తొలి 'ప్రాంతీయ శీఘ్ర రవాణా వ్యవస్థ' (రీజనల్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్–ఆర్ఆర్‌టీఎస్) కిందికి వస్తుంది. ఇది గంటకు 180 కి.మీ.ల వేగంతో ప్రయాణించేలా రూపొందించారు. 82 కిలోమీటర్ల కారిడార్‌ను ప్రధాని జాతికి అంకితం చేశారు. మేరఠ్ మెట్రో, నమో భారత్ ఆర్ఆర్‌టీఎస్‌లు ఒకే మౌలిక సదుపాయాలను ఉపయోగించుకుంటాయి.

# తమిళనాడులో భారీ ఉగ్ర కుట్ర భగ్నం

దేశంలో భారీ ఉగ్రదాడులకు ప్లాన్ చేస్తున్న ముఠాను దిల్లీ పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం ఎనిమిది మంది పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారికి పాకిస్థాన్ గూఢచర్య సంస్థ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్(ఐఎస్ఐ), బంగ్లాదేశ్‌కు చెందిన తీవ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. తదుపరి దర్యాప్తు కోసం వారిని దిల్లీకి తరలిస్తున్నారు. ఇటీవల దిల్లీ మెట్రో సహా దేశ రాజధానిలో పలు ప్రాంతాల్లో ప్రజలను రెచ్చగొట్టే విధంగా పోస్టర్లు అంతికించారు. ఆ పోస్టర్లలో కశ్మీర్‌కు సంబంధించిన ఉద్రిక్త అంశాలు ఉండటంతో భద్రతా సంస్థలు అప్రమత్తమయ్యాయి. ఆ పోస్టర్ల గురించి తెలుసుకునేందుకు దర్యాప్తు చేపట్టిన స్పెషల్ సెల్ తమిళనాడులో కార్యకలాపాలు సాగిస్తున్న ఈ నెట్‌వర్క్‌ను గుర్తించారు. ఆరుగురు వ్యక్తులు తిరుప్పూర్?లోని వస్త్ర కర్మాగారాల్లో పని చేస్తున్నారని, నకిలీ ఆధార్? కార్డును కలిగి ఉన్నారని దర్యాప్తు అధికారులు కనుగొన్నారు. తిరుప్పూర్?కు చేరిన స్పెషల్ సెల్?, స్థానిక పోలీసుల సాయంతో ఆరుగురిని ఆరెస్ట్ చేశారు.

**బంగాల్‌లోనూ మరో ఇద్దరు అరెస్ట్**

తిరుప్పూర్‌లోని ఉతుకులి నుంచి ఇద్దరు, పల్లడం నుంచి ముగ్గురు, తిరుమురుగన్‌పూండి ప్రాంతం నుంచి ఒకరు అరెస్టయ్యారు. వారు మిజానుర్ రెహమాన్, మహ్మద్ షబత్, ఉమర్, మహ్మద్ లితాన్, మహ్మద్ షాహిద్, మహ్మద్ ఉజ్జల్‌గా గుర్తించారు. అలాగే బంగాల్? నుంచి మరో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. అరెస్టైన వారిలో కొందరు బంగ్లాదేశ్ పౌరులని, వారు తమ అసలు గుర్తింపును దాచేందుకు నకిలీ ఆధార్ కార్డులు వినియోగించినట్లు పోలీసులు తెలిపారు. అరెస్టైన వారిని తదుపరి విచారణ, చట్టపరమైన చర్యల కోసం రైలులో దిల్లీకి తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు.



**మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డుల స్వాధీనం**

విదేశీ హ్యాండ్లర్ల ఆదేశాల మేరకు భారత్‌లో పెద్ద ఎత్తున ఉగ్రదాడి చేయాలని వీరు ప్రణాళిక రచించినట్లు దర్యాప్తు అధికారులు తెలిపారు. వారితో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు చెప్పారు. ఇక ఆపరేషన్ సమయంలో ఎనిమిది మొబైల్ ఫోన్లు, 16 సిమ్ కార్డులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డిజిటల్ ఆధారాలు, ఇతర వ్యక్తులతో ఉన్న సంబంధాలపై దర్యాప్తు కొనసాగుతోంది. బంగ్లాదేశ్‌కు చెందిన తంజీమ్ సంస్థలతో వీరి సంబంధాలపై మరింత విచారణ చేపట్టనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ ఉగ్రముఠాతో సంబంధం ఉన్న మరికొందరి కోసం గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

**ఏఐ సమ్మిట్ సందర్భంగా కశ్మీర్ పోస్టర్లు**

ఈ ఎనిమిది మంది సోషల్ మీడియా ద్వారా పరస్పరం సంప్రదింపులు కొనసాగించిటన్లు పోలీసులు తెలిపారు. పాకిస్థాన్‌కు చెందిన ఉగ్ర సంస్థలకు మద్దతుగా పోస్టులు పెట్టినట్లు గుర్తించినట్లు చెప్పారు. ఈ ఎనిమిది మందిలో నలుగురు ఇటీవల జరిగిన ఏఐ సమ్మిట్ సందర్భంగా దిల్లీకి వచ్చి 'ఫ్రీ కశ్మీర్' వంటి ప్రేరేపణాత్మక పోస్టర్లు మెట్రో స్టేషన్‌లో అతికించినట్లు పోలీసుల తెలిపారు. ఆ తర్వాత తిరిగి తమిళనాడు, బంగాల్?కు వెళ్లినట్లు వెల్లడించారు.

**ఉగ్రముప్పు హెచ్చరికతో దిల్లీలో హైఅలర్ట్**

దేశ రాజధాని దిల్లీలో ఉగ్ర దాడులు జరిగే అవకాశముందని నిఘా వర్గాలు హెచ్చరించడంతో శనివారం దిల్లీ హైఅలర్ట్ ప్రకటించారు. దిల్లీలోని ఎర్రకోట, చాందీని చౌక్?, ప్రముఖ ఆధ్యాత్మిక ప్రదేశాలను లక్ష్యంగా చేసుకుని దాడులకు కుట్ర పన్నినట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. అందుకోసం భార మొత్తంలో పేలుడు పదార్థాలను వినియోగించే అవకాశముం దని తెలిపాయి. దీంతో అప్రమత్తమైన భద్రతా సంస్థలు దిల్లీలో హైలర్ట్ ప్రకటించి, బాంబ్? స్క్వాడ్?తో బృందాలు రంగంలోకి దిగాయి. దేవాలయాలు, రద్దీగా ఉండే ప్రదేశాల్లో అదనపు సిబ్బందిని మోహరించాయి. ఫిబ్రవరి 6న పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లో మసీదు పేలుడు ఘటనకు ప్రతీకారంగా భారత్‌లో భారీ ఉగ్రదాడి చేయాలనే యోచనలో ఉన్నట్లు సమాచారం.

## భారత ప్రతిభను ఇతర దేశాలకు ధారపోస్తున్నాం

ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ అధ్యక్షుడు సామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారాన్ని రేపుతున్నాయి. భారత్ ప్రపంచ దేశాలకు ప్రతిభను అందించే కేంద్రంగానే మిగిలిపోయిందని దుయ్యబట్టారు. సొంతంగా గ్లోబల్ టెక్నాలజీ ఉత్పత్తులను సృష్టించలేకపోయిందని విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలో పిట్రోడా చేసిన వ్యాఖ్యలపై అధికార బీజేపీ తీవ్రస్థాయిలో స్పందించింది.

ఒక యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సామ్ పిట్రోడా భారత సాంకేతిక పరిజ్ఞానం, ఆవిష్కరణలపై కీలక వ్యాఖ్యలు చేశారు. 150 కోట్ల జనాభా కలిగిన దేశం ఇప్పటికీ విదేశీ సాంకేతికతపై ఆధారపడటం దురదృష్టకరమని అన్నారు. 'మనం భారీ స్థాయిలో యువ ప్రతిభను సృష్టించాం, కానీ అది ఇంకా 'ముడి' రూపంలోనే ఉంది. ఈ ప్రతిభ అంతా ప్రపంచవ్యాప్తంగా ఉన్న బహుళజాతి కంపెనీలకు ప్రోగ్రామింగ్, బ్యాంకింగ్, న్యాయ వ్యవస్థలు, తయారీ, లాజిస్టిక్స్ రంగాల్లో సేవ చేయడానికి ఉపయోగపడుతోంది. మనం మన సొంత ప్రతిభను ఇతరులకు సేవ చేయడానికి ధారపోస్తున్నాం' అని పేర్కొన్నారు. అంతేకాకుండా, పిట్రోడా మరికొన్ని ఘాటు వ్యాఖ్యలు చేశారు. భారత్ మైక్రోసాఫ్ట్ వంటి పెద్ద కంపెనీని గానీ, ప్రపంచ స్థాయి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ను గానీ సృష్టించల్లదని చెప్పుకొచ్చారు. కనీసం మొబైల్ ఫోన్ల కోసం ఒక ఆపరేటింగ్ సిస్టమ్‌ను కూడా తయారు చేయలేకపోయామన్నారు. ఇంత పెద్ద దేశానికి సొంత ఆపరేటింగ్ సిస్టమ్ లేకపోవడం నిజంగా సిగ్గుచేటని ఘాటుగా వ్యాఖ్యానించారు.

పిట్రోడాకు బీజేపీ కౌంటర్

పిట్రోడా చేసిన వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. బీజేపీ జాతీయ ప్రతినిధి షెహజాద్ పూనావాలా సోషల్ మీడియా వేదికగా పిట్రోడా వ్యాఖ్యలకు ఖండించారు. దేశంలో తయారైన పలు ఆపరేటింగ్ సిస్టమ్‌ల పేర్లను ఆయన ప్రస్తావించారు. 'ముందుగా వాస్తవాలు తెలుసుకోండి. భారత్ వద్ద లినక్స్, మాయ ఓఎస్, ప్రైమ్‌ఓఎస్, భార్‌ఓఎస్, ఇండస్ ఓఎస్, చీఖ్ాబఖుఅ్‌బఎ రూ వంటి స్వదేశీ ఆపరేటింగ్ సిస్టమ్స్ ఉన్నాయి. అబద్ధాలతో భారత్‌ను కించపరచడమే కాంగ్రెస్ పని' అని ఆయన మండిపడ్డారు. ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ అయిన యూపీఐని భారత్ సృష్టించిందని, అది నేడు అనేక దేశాలకు ఆదర్శంగా నిలిచిందని గుర్తు చేశారు. గ్లోబల్ టెక్నాలజీ రంగంలో భారత్ ఇప్పుడు 'నాయకత్వ' పాత్రకు చేరుకుందన్నారు. కరోనా కాలంలో భారత్ స్వదేశీ వ్యాక్సిన్లను తయారు చేసి ప్రపంచ దేశాలకు సరఫరా చేసిందని, రక్షణ రంగంలో కూడా 'మేక్ ఇన్ ఇండియా' వేగంగా పుంజుకుంటోందని చెప్పారు.

# ట్రంప్ మాస్టర్ ప్లాన్.. ఖమేనీ, ఆయన కుమారుడిని అంతం చేసేలా వ్యూహం!

అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రస్థాయికి చేరుకుంటున్నాయి. ఇరాన్ అణు కేంద్రాలపైనే కాకుండా, ఏకంగా ఆ దేశ అత్యున్నత నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ, ఆయన వారసుడిగా భావిస్తున్న కుమారుడు మొజ్తాబా ఖమేనీలను లక్ష్యంగా చేసుకునే సైనిక ప్రణాళికలను అమెరికా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ప్రముఖ వార్తా సంస్థ 'ఆక్సియోస్' ఒక కథనాన్ని ప్రచురించింది. ఇరాన్ తదుపరి పాలకుడిగా రేసులో ఉన్న మొజ్తాబా పేరు కూడా ఈ జాబితాలో ఉండటం ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇరాన్ విషయంలో అన్ని రకాల ప్రణాళికలతో సిద్ధంగా ఉన్నామని అమెరికా ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఒకవేళ యుద్ధం అనివార్యమైతే ఇరాన్ అగ్ర నాయకత్వాన్ని తొలగించేందుకు కూడా వెనుకాడబోమనీ ట్రంప్ సలహాదారు ఒకరు పేర్కొన్నారు. మరోవైపు, ఇరాన్‌పై పరిమిత దాడులు చేసే ఆలోచనలో ఉన్నారా అన్న ప్రశ్నకు తాను దాని గురించి ఆలోచిస్తున్నానని అధ్యక్షుడు ట్రంప్ స్వయంగా బదులిచ్చారు. చర్చలకు రావడానికి ఇరాన్‌కు 10–15 రోజులు సమయం ఇస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. అమెరికా హెచ్చరికలపై ఇరాన్ కూడా ఘాటుగానే స్పందించింది. తాము చర్చలకు సిద్ధంగా ఉన్నామని, అయితే దాడులు జరిగితే యుద్ధానికి కూడా వెనుకాడబోమని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగ్చీ తేల్చి చెప్పారు. అమెరికా దాడులకు పాల్పడితే మధ్యప్రాచ్యంలోని వారి సైనిక స్థావరాలే తమ తదుపరి లక్ష్యాలని ఐక్యరాజ్యసమితికి ఇరాన్ ఇప్పటికే తెలియజేసింది.

ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా గత రెండు దశాబ్దాల్లో ఎన్నడూ లేనంతగా మధ్యప్రాచ్యంలో సైన్యాన్ని మోహరించింది. ఇప్పటికే రెండు అమెరికా విమాన వాహక నౌకలు ఇరాన్ తీరానికి సమీపంలో ఉన్నాయి. ఖతార్, బహ్రెయిన్ వంటి దేశాల నుంచి వేలాది మంది సైనికులను వ్యూహాత్మక ప్రాంతాలకు తరలించింది. ఇరాన్ అగ్ర నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకోవడం పూర్తిస్థాయి యుద్ధానికి దారితీయవచ్చని, ఇది వినాశకర పరిణామాలకు కారణమవుతుందని అంతర్జాతీయ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## ఆ సదస్సు టర్నింగ్ పాయింట్

న్యూఢిల్లీ

కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో భారత్ సాధించిన విజయాలు చూసి ప్రపంచ దేశాల అధినేతలు ఆశ్చర్యపోయారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఢిల్లీలో ఇటీవల నిర్వహించిన ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సును కీలక టర్నింగ్ పాయింట్‌గా పేర్కొన్నారు. భవిష్యత్తులో ఏఐ శక్తిని ఎలా వినియోగించుకోవాలో దిశా నిర్దేశం చేయడానికి సదస్సు తోడ్పడుతుందని తెలిపారు. 'మన్ కీ బాత్'లో భాగంగా ప్రధాని మోదీ ఆదివారం దేశ ప్రజలనుద్దేశించి రేడియోలో ప్రసంగించారు. సదస్సుకు ప్రపంచ దేశాల అధినేతలు, పారిశ్రామిక వర్గాలు, సీఈఓలు, ఐఏ స్టార్టప్ రంగం ప్రతినిధులు, నవీన ఆవిష్కర్తలు హాజరయ్యారని గుర్తుచేశారు. "సదస్సులో ప్రధానంగా రెండు అంశాలు దేశాధినేతలను విశేషంగా ఆకట్టుకున్నాయి. వారు అమూల్ పాల కేంద్రాన్ని సందర్శించారు. రైతులు తమ పాడి పశువులను ఏఐ టెక్నాలజీతో నిరంతరం గమనించే తీరు పరిశీలించామన్నా రు. మన ప్రాచీన గ్రంథాలు, విజ్ఞానం, రాతప్రతులను ఏఐ టెక్నాలజీతో పరిరక్షిస్తున్న తీరు, వాటిని నేటి తరానికి అందిస్తున్న వైనాన్ని చూసి ఆశ్చర్యపడ్డారు. సదస్సులో మూడు 'మేడిన్ ఇండియా' ఏఐ మోడల్స్ విడుదల చేశాం" అని వివరించారు.

**డిజిటల్ మోసాలతో జాగ్రత్త**

ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు, డిజిటల్ అరెస్టుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మోదీ సూచించారు. "ప్రధానంగా వృద్ధులు ఈ మోసాల బారిన పడుతుండటం ఆందోళనకరం. బ్యాంకుల కేవైసీ ప్రక్రియను ఎప్పటికప్పుడు పూర్తి చేసుకోవాలి" అన్నారు. టీ20 క్రికెట్ ప్రపంచ కప్‌లో విదేశాల తరఫున భారతీయ మూలాలున్న ఆటగాళ్లు చాలామంది ఆడుతుండటం పట్ల ప్రధాని హర్షం వెలిబుచ్చారు. "భారతీయులు ఎక్కడికి వెళ్లినా తమ మూలాలు మర్చిపోరు. భారతీయతకు ఇదొక హాల్‌మార్క్. తాము నివసిస్తున్న దేశాల అభివృద్ధి కోసం శ్రమిస్తున్నారు. బానిసత్వ గుర్తులను శరవేగంగా వదిలించుకుంటున్నాం. భారతీయ సంస్కృతిని సూచించే చిహ్నాల విలువను గుర్తించడం మొదలైంది. ఈ దిశగా రాష్ట్రపతి భవన్ ముఖ్యమైన కార్యక్రమం నిర్వహిస్తోంది. సోమవారం రాజాజీ ఉత్సవ్ జరుగనుంది. రాష్ట్రపతి భవన్‌లో బ్రిటిష్ ఆర్కిటెక్ట్ ఎడ్విన్ లూటెన్స్ విగ్రహం స్థానంలో స్వతంత్ర భారత తొలి భారత గవర్నర్ జనరల్ సి.రాజగోపాలాచారి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు.

**పరీక్షలంటే భయమొద్దు**

విద్యార్థులంటే పరీక్షల యోధులని మోదీ అన్నారు. "మీరు త్వరలో పరీక్షలు రాయనున్నారు. మార్కుల ఆధారంగా సత్తాను లెక్కగట్టలేరని తెలుసుకోండి. మీ ప్రతిభకు అవొక్కటే ఆధారం కాదు. పరీక్షల గురించి ఎన్నో సందేహాలుంటాయి. అలాగని ఆందోళన వద్దు మిమ్మల్ని మీరు విశ్వసించండి. చదివింది మనసుపెట్టి పరీక్షల్లో రాయండి" అని వారికి సూచించారు. కేరళ కుంభమేళాగా పిలిచే మామంగం సంప్రదాయాన్ని మోదీ ప్రస్తావించారు. ఈ వేడుక 250 ఏళ్లకు ఒకసారి జరుగుతుంది. పలు రాష్ట్రాల్లో రైతులు సాధించిన విజయాల గురించి కూడా ప్రధాని మాట్లాడారు.

## యూఎస్ పట్టభద్రుల్లో హిందువులే ఎక్కువ

వాషింగ్టన్

అగ్రరాజ్యం అమెరికాలో ఎక్కువ మంది ఉన్నత విద్యావంతులు, పట్టభద్రులు ఏ మతస్థులో తెలుసా? అందరూ అనుకుంటున్నట్లు క్రైస్తవులు కాదు. హిందువులే అగ్రస్థానంలో ఉన్నారు. వాషింగ్టన్‌కు చెందిన ప్యూ రీసెర్చ్ సెంటర్ తాజాగా ఈ విషయం వెల్లడించింది.

నాలుగేళ్ల కాలేజీ డిగ్రీ పూర్తిచేసిన పట్టభద్రులు ఏ మతానికి చెందిన వారన్న దానిపై 2023--24 రిలీజియస్ ల్యాండ్‌స్కేప్ స్టడీ (ఆర్ఎల్ఎస్) పేరిట ఈ సంస్థ విస్తృతంగా అధ్యయనం చేసింది. ఉన్నత విద్యావంతుల్లో అగ్రస్థానంలో హిందువులు, ఆ తర్వాతి స్థానంలో యూదులున్నట్లు తన నివేదికలో పేర్కొంది. అమెరికాలో ప్రతి 10 మంది హిందువుల్లో కనీసం ఏడుగురు బ్యాచిలర్స్ డిగ్రీ లేదా ఉన్నత విద్య అభ్యసించారు. అంటే 70 శాతం శాతం మంది ఉన్నత విద్యావంతులే. యూదుల్లో ఈ సంఖ్య 65 శాతం.

స్థానిక అమెరికన్లలో కేవలం 35 శాతం మంది ఉన్నత విద్య అభ్యసించారు. ఇతర మతస్థులు సగటు కంటే కొద్దిగా పైస్థానంలో నిలిచారు. వీరిలో ముస్లింలు, బౌద్ధులు, ఆర్థోడాక్స్ క్రైస్తవులున్నారు. ఆయా మతస్థుల్లో ప్రతి పది మందిలో కనీసం

నలుగురు బ్యాచిలర్స్ డిగ్రీ పూర్తిచేశారు. ప్రొటెస్టంట్ క్రైస్తవులు కూడా ఈ జాబితాలో నిలిచారు.

ఎవెలాంజికల్ ప్రొటెస్టంట్లు, క్యాథలిక్స్ సగటు కంటే దిగువ స్థాయిలో ఉన్నారు. వీరు చాలావరకు నల్లజాతివారే.

మొత్తం స్థానిక అమెరికా జనాభాలో పరిశీలిస్తే ప్రతి పది మందిలో నలుగురు మాత్రమే బ్యాచిలర్స్ డిగ్రీ అభ్యసించారు.

అమెరికాలో ఉన్నత విద్యాభ్యాసం విషయంలో మతాల మధ్య చాలా వ్యత్యాసాలు ఉన్నట్లు తెలుస్తోంది.

వలసలు, తద్వారా స్థానిక జనాభా స్థితిగతుల్లో మార్పులు రావడమే ఈ వ్యత్యాసాలకు కారణమని ప్యూ రీసెర్చ్ సెంటర్ తమ నివేదికలో అభిప్రాయపడింది. హిందువులు, ముస్లింలు, బౌద్ధులు చాలావరకు ఇతర దేశాల అమెరికాకు వలసవచి?చనవారే కావడం గమనార్హం. వీరు ఉన్నత విద్య లేదా ఉద్యోగాల కోసం, జీవనోపాధి కోసం వచ్చారు.

అమెరికాలో ఉద్యోగాల కోసం భారతీయులు అధికంగా తరలివస్తున్నారు. ఇందుకు హెచ్--1బీ వీసాలు వారికి తోడ్పడుతున్నాయి. ఈ వీసాలో అత్యధికంగా ప్రయోజనం పొందుతున్నది భారతీయులే కావడం గమనార్హం. అమెరికాలో టెక్నాలజీ, ఆరోగ్య సంరక్షణ, విద్యా రంగాలను భారతీయులు ప్రభావితం చేస్తున్నారు.

## 2026 ఎన్నికల్లో పెరంబూరు నుంచి పోటీ

తమిళనాడు రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ, 2026 అసెంబ్లీ ఎన్నికల కోసం తమ వ్యూహాలకు పదును పెడుతోంది. ఇందులో భాగంగా, పార్టీ అధ్యక్షుడు విజయ్ పెరంబూరు నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని కోరుతూ పార్టీ శ్రేణులు ఏకగ్రీవంగా తీర్మానం చేశాయి. ఉత్తర చెన్నైని రాబోయే రాజకీయ పోరుకు కేంద్రంగా మార్చాలన్న పార్టీ ఉద్దేశం దీని ద్వారా స్పష్టమవుతోంది. ఆదివారం చెన్నైలో జరిగిన పార్టీ సమావేశంలో టీవీకే ఎన్నికల ప్రచార నిర్వహణ కార్యదర్శి ఆదవ్ అర్జున ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. పెరంబూరు నుంచి విజయ్ పోటీ చేయాలన్నది కార్యకర్తలందరి ఏకగ్రీవ అభిప్రాయమని ఆయన తెలిపారు. ఈ తీర్మానానికి పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్. ఆనంద్ మద్దతు తెలిపారు. కార్యకర్తల మనోభావాలను గౌరవిస్తామని, వారి ఆకాంక్షను దళపతి విజయ్‌కు తెలియజేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ డిమాండ్ వెనుక ఉన్న కారణాన్ని వివరిస్తూ ఆదవ్ అర్జున కీలక వ్యాఖ్యలు చేశారు. పేదరికం ఎక్కువగా, ప్రజల అవసరాలు అధికంగా ఉన్న నియోజకవర్గాల నుంచే పోటీ చేయాలన్నది తమ పార్టీ సిద్ధాంతమని, ఉత్తర చెన్నైలోని పరిస్థితులు దీనికి సరిగ్గా సరిపోతాయని అన్నారు. పెరంబూరు, కొళత్తూరు, లేదా ఆర్.కె. నగర్ వంటి ఉత్తర చెన్నై నియోజకవర్గాల నుంచి పోటీ చేసేందుకే విజయ్ కూడా మొగ్గు చూపుతున్నారని ఆయన వెల్లడించారు. ఇదే సమయంలో, అధికార డీఎంకేపై ఆదవ్ అర్జున విమర్శలు గుప్పించారు. చెన్నై డీఎంకేకు కంచుకోట అన్న వాదనను ఆయన తోసిపుచ్చారు. "ఇకపై చెన్నై టీవీకేదే" అని ప్రకటించి, ఆ అభిప్రాయాన్ని మార్చడానికే తాము రాజధాని నుంచి ప్రచారం ప్రారంభిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో డీఎంకే ఆధిపత్యం ఉందని చెబుతున్నా, స్థానిక బలమైన నేతలు ఇప్పుడు టీవీకే వైపు చూస్తున్నారని మంత్రి పి.కె. శేఖర్ బాబును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ పరిణామంతో, 2026 ఎన్నికల్లో చెన్నై కేంద్రంగా టీవీకే దూకుడుగా ప్రచారం చేయనుందన్న సంకేతాలు వెలువడుతున్నాయి.

## సంపాదకీయం

# హిట్ అండ్ రన్ రాజకీయాల్లో ప్రతిపక్ష పార్టీలు


“నిజమైన ప్రతిపక్షం ప్రభుత్వానికి శత్రువు కాదు, ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వాన్ని నిలదీసే ఒక జాగృత శక్తి “ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలు జరగడం, మెజారిటీ వచ్చిన వారు పాలించడం మాత్రమే కాదు. అధికార పక్షం బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినప్పుడు కళ్ళెం వేసే ప్రతిపక్షం ఉండటం ఆ వ్యవస్థకు ప్రాణవాయువు వంటిది. కానీ, నేడు తెలుగు రాష్ట్రాల్లో ప్రతిపక్షం అంటే కేవలం ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం అనే సంకుచిత అర్థానికి పరిమితమైపోయింది. క్షేత్రస్థాయిలో పోరాటాల కంటే, సోషల్ మీడియా వేదికగా సాగే ట్రోలింగ్ రాజకీయాలే జ్యమేలుతున్నాయి.ఒకప్పుడు ప్రతిపక్షం అంటే ప్రభుత్వానికి వెన్నులో వణుకు పుట్టించే వ్యవస్థ. అసెంబ్లీలో తార్కికమైన చర్చలు, బయట ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటాలు ఉండేవి. ఒక జీవో విడుదల చేయాలంటేప్రభుత్వం పదిసార్లు ఆలోచించేది. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది.ప్రతిపక్షాలు తాము అధికారంలో లేమన్న విషయాన్ని జీర్ణించుకోలేక, ప్రజల కోసం పోరాడటం కంటే తమ ఉనికిని కాపాడుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నాయి. అధికార పక్షంపై వ్యతిరేకత పెంచితే చాలు, తదుపరి అధికారం తమకే దక్కుతుందనే ఒక రకమైన నెగటివ్ పాలిటిక్స్ భ్రమలో ప్రతిపక్షాలు ఉండిపోతున్నాయి. అభివృద్ధిలో లోపాలను ఎత్తిచూపడం కంటే, వ్యక్తిగత విమర్శలు, అసత్య ప్రచారాల ద్వారా ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టడమే ఏకైక అజెండాగా మారిపోయింది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది.ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ వాతావరణం ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రశ్నిస్తోంది. గత ఎన్నికల్లో సుమారు 40 శాతం ఓటు బ్యాంకును, కోటి మందికి పైగా ప్రజల మద్దతును పొందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, కేవలం ప్రతిపక్ష హోదా అనే సాంకేతిక కారణాన్ని సాకుగా చూపి సభకు దూరం కావడం ఆ ఓటర్లను వంచించడమే అవుతుంది. ప్రజాస్వామ్యంలో సంఖ్య కంటే గొంతుక ముఖ్యం. పది మంది ఎమ్మెల్యేలు ఉన్నా, వారు సభలో తార్కికంగా మాట్లాడితే ప్రభుత్వం దిగిరాక తప్పదు. కానీ, వైసీపీ నాయకత్వం కేవలం తమపై వస్తున్న కేసుల నుండి రక్షణ పొందడానికో లేదా తమ సొంత రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికో పరిమితమవుతోంది. తమ ఐదేళ్ల పాలనలో జరిగిన తప్పిదాలను సమీక్షించుకుని ప్రజల వద్దకు వెళ్లాల్సింది పోయి, అధికార పక్షం మమ్మల్ని ఇబ్బంది పెడుతోంది అనే విక్టిమ్ కార్డ్ వేసుకోవడం వల్ల ప్రజల్లో సానుభూతి కంటే అసహనమే ఎక్కువగా కనిపిస్తోంది. ప్రస్తుతం వైసీపీ చేస్తున్న పోరాటాలన్నీ ఎక్కువగా కేసుల చుట్టూ, పార్టీ నేతల రక్షణ చుట్టూనే తిరుగుతున్నాయి. సూపర్ సిక్స్ హామీల అమలు , ప్రభుత్వ వైఫల్యాల మీద నిర్మాణాత్మక విమర్శలు చేయడం కంటే, సోషల్ మీడియాలో బురద చల్లడం పైనే ఆ పార్టీ యంత్రాంగం ఎక్కువ దృష్టి పెడుతోంది. రాజకీయం అంటే అధికారం కోసం చేసే ఆరాటం మాత్రమే కాదు, అధికారం లేనప్పుడు ప్రజల కోసం చేసే పోరాటం అన్న సూత్రాన్ని విస్మరించి, కేవలం డిజిటల్ వేదికలకే పరిమితం కావడం వల్ల క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్ నీరసించిపోతోంది. అసెంబ్లీ అనేది ప్రజా సమస్యల చర్చా వేదిక, అక్కడ గొంతు వినిపించకపోతే ప్రతిపక్షంగా తన ఉనికిని కోల్పోయినట్టే అవుతుంది.మరోవైపు, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి పార్లమెంటులో బేషరతుగా మద్దతు ఇస్తూ, రాష్ట్రంలో అదే పార్టీ భాగస్వామిగా ఉన్న కూటమి ప్రభుత్వంపై పోరాడుతున్నామని చెప్పడం ప్రజల్లో తీవ్ర అయోమయానికి దారితీస్తోంది. ఈ ద్వంద్వ వైఖరి పరోక్షంగా అధికార పక్షానికే సహకరించడమే అవుతుంది. ఢిల్లీలో దోస్తీ, గల్లీలో కుస్తీ అన్నట్లుగా సాగుతున్న ఈ రాజకీయం ఆ పార్టీ విశ్వసనీయతను దెబ్బతీస్తోంది. నాయకుడి బలం గెలిచినప్పుడు కాదు, ఓడిపోయినప్పుడు ఎలా నిలబడ్డాడు అనే దానిపైనే ఆధారపడి ఉంటుంది..మరోవైపు, అధికార పక్షాన్ని విమర్శించే క్రమంలో వైసీపీ అనుసరిస్తున్న తీరు అత్యంత వివాదాస్పదంగా మారుతోంది. ప్రజా సమస్యలపై నిర్మాణాత్మక చర్చలు జరపాల్సింది పోయి, ముఖ్యమంత్రిని, మంత్రులను , వారి కుటుంబ సభ్యులను వ్యక్తిగతంగా దూషించడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూడటం అప్రజాస్వామికం. ఇటువంటి చర్యలు రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యలను సృష్టించడమే కాకుండా, కులాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయంగా పబ్బం గడుపుకోవాలనే వ్యూహాన్ని బయటపెడుతున్నాయి. విమర్శలు విధానాల మీద ఉండాలి కానీ, వ్యక్తుల మీద కాదు అనే కనీస రాజకీయ ధర్మాన్ని విస్మరించి, బూతు పురాణాలతో రాజకీయ కలుషితం చేయడం వల్ల ప్రజల్లో అసహనం పెరుగుతోంది. దీన్ని వైసీపీ గుర్తించడం లేదు.తెలంగాణ రాజకీయ యవనికపై ఒకప్పుడు సింహగర్జన చేసిన గులాబీ దళం, నేడు ప్రతిపక్ష పాత్రను పోషించడంలో పూర్తిగా వెనుకబడిపోయింది. మేము ఇంకా సమర్థవంతమైన ప్రతిపక్షంగా అవతరించలేదు అని ఆ పార్టీ కీలక నేత జగదీష్ రెడ్డి స్వయంగా అంగీకరించడం వారి దైన్యస్థితికి అద్దం పడుతోంది. పదేళ్ల పాటు పరిపాలించిన అనుభవం ఉన్న పార్టీ, ప్రజా సమస్యలపై పదునైన బాణాలను సంధించాల్సింది పోయి, ఇంకా బాధ్యతారాహిత్యంతో కాలం గడుపుతోంది. ప్రజలు మిమ్మల్ని ప్రతిపక్షంలో కూర్చోబెట్టింది కేవలం ఫామ్ హౌస్‌లకే పరిమితం కావడానికి కాదు, అసెంబ్లీలో ప్రజా గొంతుకగా నిలవడానికి అని ఇప్పటికీ గుర్తించలేకపోతున్నరా?. బీఆర్ఎస్ ప్రస్తుతం అనుసరిస్తున్న తీరు క్షేత్రస్థాయిలో ప్రజల కష్టాల్లో పాలుపంచుకోవడం కంటే, సోషల్ మీడియా వేదికగా అబద్ధాలను వందసార్లు ప్రచారం చేసి నిజం చేయాలనే వ్యూహంపైనే ఎక్కువగా ఆధారపడుతున్నట్లుగా కనిపిస్తోంది. ప్రభుత్వంపై వ్యతిరేకత వస్తుందని ఆశించడం రాజకీయాల్లో సహజమే, కానీ ఆ వ్యతిరేకతను తమ వైపు తిప్పుకునే విశ్వసనీయత ను వారు కోల్పోతున్నారు.రాజకీయాలు అంటే కేవలం అధికార మార్పిడి కోసం చేసే కుతంత్రాలు కాకూడదు. అవి ప్రజా సేవ కోసం చేసే యజ్ఞం కావాలి. అప్పుడే తెలుగు రాష్ట్రాల కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. తెలుగు రాష్ట్రాలకు ఇప్పుడు కావాల్సింది కేవలం విమర్శించే ప్రతిపక్షం కాదు, పరిష్కారాలను చూపే ప్రతిపక్షం. ప్రభుత్వం చేసే ప్రతి పనిని వ్యతిరేకించడం కాకుండా, అభివృద్ధి పనుల్లో లోపాలను వేలెత్తి చూపిస్తూ, దానికి మెరుగైన ప్రత్యామ్నాయాలను సూచించగలిగే మేధోశక్తి ప్రతిపక్షాలకు ఉండాలి. అసెంబ్లీని గౌరవించడం, సభా మర్యాదలను పాటించడం, ప్రజా సమస్యలపై లోతైన అధ్యయనం చేయడం ద్వారా మాత్రమే ప్రతిపక్షాలు ప్రజల మద్దతును తిరిగి పొందగలవు. రాజకీయం అంటే కేవలం ఎన్నికల మేనేజ్‌మెంట్ కాదు, అది ప్రజల జీవితాలను మార్చే ఒక గొప్ప సాధనం. ఈ నిజాన్ని గుర్తించి ప్రతిపక్షాలు తమ వైఖరిని మార్చుకోకపోతే, భవిష్యత్తులో వారు ప్రజల నుండి మరింత దూరం కావడమే కాకుండా, ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రమాదంలో పడే అవకాశం ఉంది. సమర్థవంతమైన ప్రతిపక్షం లేని రాష్ట్రం దిక్సూచి లేని నావ లాంటిది, కాబట్టి తెలుగు రాష్ట్రాల ప్రతిపక్షాలు తమ అస్తిత్వ పోరాటాన్ని పక్కన పెట్టి ప్రజా హితం కోసం పోరాడాల్సిన సమయం ఆసన్నమైంది. లేకపోతే.. ఓటములకు కారణాలు చెప్పుకోవడానికి అలవాటు పడాల్సిందే.

# మారిషస్‌లో తెలుగు వెలుగు




ఆఫ్రికా ఖండ తీర ఆగ్నేయ తీరప్రాంతాల్లో 2000లో మీటర్ల దూరంలో హిందూ మహా సముద్రంలో ఉన్న ద్వీప దేశం మారిషస్. 2040 చ.కి.మీల వైశాల్యం కలిగి, పోర్టు లూయిస్ రాజధానిగా దాదాపు 12 లక్షల పై చిలుకు జనాభా కలిగి, ఆంగ్లం, తెలుగు అధికార భాషలుగా, మారిషియన్ క్రియోల్, ఫ్రెంచి, చైనీస్ ఉర్దూలతో పాటు, భోజ్ పూరి, మరాఠీ, తమిళం, ఉర్దూ తదితర భారతీయ ప్రాంతీయ భాషలు గా కలిగి ఉంది. 1630 – 1710 డచ్ కాలనీగా 1715 – 1810 మధ్య ఫ్రెంచ్ కాలనీగా తర్వాత 1968 వరకు బ్రిటిష్ కాలనీల నుండి తర్వాత స్వాతంత్రం పొందింది. 1903లో పైచెల్లిసును ప్రత్యేక కాలనీ గా రూపొందించిన తర్వాత మారిషస్ క్రమానుగత అభివృద్ధి జరుగు తున్నది. ఆఫ్రికా దేశాల మానవ అభివృద్ధి జాబితాలో ద్వితీయ స్థానంలో ఉన్న మారిషస్ హిందూ యిజం అతి పెద్ద మతంగా ఉన్న ఏకైక ఆఫ్రికా దేశంగా ప్రత్యేకతను కలిగి ఉంది.రైతులు చెరకు పొలాలలో పని చేయడానికి పెద్దసంఖ్యలో భారత దేశం నుండి కార్మికులను తీసుకు వచ్చారు. 1834 – 1921 మధ్యలో ద్వీపంలో సుమారు 5 లక్షల మంది కార్మికులు పనిచేసారు. నేడు మారిషస్ జనాభాలో 68% కంటే ఎక్కువ మంది భారతీయ మూలానికి చెందిన వారు, సాధారణంగా ఇండో – మారిషియన్లు అని పిలుస్తారు. ప్రైవేటు వ్యవసాయ దారుల క్రింద కూలీలుగా పనిచేయటానికి 1835 లో కిష్టమ్, వెంకటపతి, అప్పయ్య అనే ముగ్గురు తెలుగు వారు కాంది శీకులుగా తొలిసారిగా మారిషస్‌లో అడుగు పెట్టారు. ఆ మరుసటి సంవత్సరం గౌంజన్ అనే ఓడలో దాదాపు 30 మంది తెలుగు వారు ఆ ద్వీపంలో కాలు పెట్టారు. కాకినాడ సమీపాన వున్న ‘కోరంగి’ రేవు నుండి బయలు దేరి వచ్చినందుకు వాళ్లని “కోరంగి వాళ్ళు” అని, వారు మాట్లాడే తెలుగు భాషకు ‘కోరంగి భాష’ అని పిలిచేవారు. 1843 సంవత్సరంలో దాదాపు 35 ఓడల్లో భారతీయులు మారిషసు వలస వచ్చారు. వారిని తీసుకుని వచ్చిన ఓడల పేర్లు సిటీ ఆఫ్ లండన్, కింగ్ స్టన్, ఫ్లవర్ ఆఫ్ ఉగీర్, సుల్తాన్, సిరంగపట్నం, బాబా బ్రాహ్మిన్, కోరంగి పికెట్ మొదలైనవి. 1834లో పుట్టిన ఊళ్లను విడిచి, చెరుకు తోటల్లో పని చేసేందుకు కూలీలుగా మారిషస్ వెళ్లిన తెలుగు వారు మాత్రం తమ తరువాతి తరం వారు కూడా తెలుగు భాషను ప్రేమించి, మాట్లాడేలా పునాది వేశారు. మాతృ భాషకు బ్రహ్మో త్సవం జరిపారు. తెలుగుకు పట్టాభిషేకం చేస్తున్నారు. వారు తమతో తీసుకెళ్లిన వ్యవసాయ పరికరాలైన పలుగు, పారతో పాటు “పెద్ద బాలశిక్ష, రామాయణ, మహాభారతం” వంటి ఇతిహాస గ్రంథాలు, అక్కడి వారిని తెలుగు వారసులుగా తీర్చిదిద్దే ప్రయత్నానికి దోహద పడుతు న్నాయి. అవే ఇప్పటి ఆరవ తరం తెలుగువారూ భాషాయజ్ఞంలో మమేకం కావడానికి కొండంత ఆసరాగా నిలుస్తున్నాయి. మారిషస్ దేశానికి వెళ్లిన తెలుగువారు తొలుత తమ భాషా, సాంప్రదాయాలను నిలుపు కోవడానికి ఇబ్బందులను ఎదుర్కొన్నా, అక్కడికి వెళ్లిన వారిలో మేబర్ ప్రాంతానికి చెందిన పండిట్ గుణ్ణయ్య 1930లో తెలుగు భాషా వికాసానికి నడుం కట్టారు. ఇలా 1947లో ముందు మారిషస్ ఆంధ్ర మహా సభ, తర్వాత నామాంతరం చెంది మారిషస్ “తెలుగు మహా సభ”గా ఆవిర్భవించింది. దాన్ని వారు తెలుగు భాషామ తల్లి ఆలయంగా భావిస్తున్నారు.. ప్రస్తుతం మారిషస్ దేశంలో తెలుగు కుటుంబాల్లో ఆరవ తరం వారు సైతం, తమ పెద్దలు వేసిన బాటలో నడుస్తుం డటం ఇక్కడి తెలుగు వారికి స్ఫూర్తిదాయక అంశం. మారిషస్ దీవిలోని మొత్తం జనాభా దాదాపు 13 లక్షలైతే, తెలుగువారు 1లక్షమందికి పైగా ఉన్నారు. వీరికోసం సుమారు 300 తెలుగు పాఠశాలలు నడుస్తుండగా, 190 మంది అధ్యాపకులు పనిచేస్తున్నారు. ప్రాథమిక తరగతులలో దాదాపు 10 వేల మంది విద్యార్థులు తెలుగు మాధ్యమంలో విద్యను అభ్యసి స్తున్నారు. మాధ్యమిక, ఉన్నత విద్య లో తెలుగు ద్వితీయ భాషగా ఉంది. ఉన్నత విద్యకోసం మహాత్మా గాంధీ విశ్వ విద్యాలయం పని చేస్తుంటే, తెలుగు మహాసభ, తెలుగు సాంస్కృతిక మండలి, తెలుగు యువ సంఘం, అనేక ఉప సంఘాలు సమన్వయంతో పని చేస్తున్నాయి. వీటికి మారిషస్ రిపబ్లిక్ ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి, పూర్తిస్థాయిలో ఆర్థికంగా చేయూత నిస్తున్నది. ఫ్రెంచికి దగ్గర గా ఉండే “క్రియోల్” వారి మాతృభాష అయినా, స్వ భాషాభి మానంతో, తెలుగును ద్వితీయ భాషగా ఎంచుకొని తెలుగు ను బతికిస్తున్నారు. ముఖ్యంగా ధర్మపురి నరసింహ శతకం, వేమన శతక పద్యాలకు వారు పెద్దపీట వేయడం, క్షేత్రయ్య అన్నమయ్య, త్యాగయ్య, రామదాసు కీర్తనలు, నరసింహ శతకం, నేర్చు కోవడంతో పాటు తెలుగు సంప్రదాయాలనూ పూర్తిస్థాయిలో పాటించడం విశేషం. ఇటీవల అక్కడి విద్యార్థులే ఓ కథా సంకలనం వెలువరించడం వారికి తెలుగు గల అభిమానానికి, ప్రేమకు తార్కాణం. మారిషస్‌లో ఓ ఆరాధ్య భావంతో తెలుగుకు బ్రహ్మోత్సవాలు 2018లో ఆగస్టు 20నుండి నిర్వహించి, అందులో భాగంగా, పద్య పఠన పోటీలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతి ప్రదానంతో పాటు ఒక్కోరోజు ఒక్కో తెలుగు సాంప్రదాయంపై అవగాహన కల్పించేందుకు వీలుగా సదస్సులను నిర్వహించారు. మారిషస్ దీవిలో తెలుగు భాషోన్న తికి సర్వస్వాన్ని ఫణంగా పెట్టి “సంజీవ నరసింహ అప్పడు” పని చేస్తున్నారు. ఆయన ఆ దేశ తెలుగు పరీక్షల విద్యాధికారి, రేడియో వ్యాఖ్యాత, జర్నలిస్ట్. మారిషస్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ తెలుగు విభాగ అధికారి. తెలుగు ప్రాంతాలతో నిరంతరం సంబంధాలు కొనసాగిస్తూ అక్కడి తెలుగు వికాసానికి కృషి చేస్తున్నారు. తెలుగు తనాన్ని నిలుపు కొనేందుకు మారిషస్ తెలుగు మహాసభ, అక్కడి ప్రభుత్వం గట్టి సంకల్పంతో పని చేస్తున్నాయి. తెలుగు మహాసభ దేశ రాజధాని పోర్టు లూయిస్ లోని రాయల్ రోడ్డులో ప్రధాన కార్యాలయం కలిగి, ఏడు ప్రాంతీయ కమిటీలు, 90 శాఖలు క్రియా శీలకంగా పని చేస్తున్నాయి అంటే, ఆ సంస్థ తెలుగు భాషాభివృద్ధికి చేస్తున్న కృషి చెప్పకనే చెబుతున్నది. తెలుగు వారికి ప్రీతి పాత్రమైన ఉగాదితో పాటు వినాయక చవితి, దీపావళి, సంక్రాంతి జాతీయ సెలవుదినాలుగా పాటించడం గమనార్హం. తెలుగు వారి సంస్కృతి ప్రతీకలైన పండగలు, పబ్బాలు ఆచరిస్తున్నారు. ప్రస్తుతం తెలుగువారిచే నిర్మితాలైన 350 దేవాలయాలూ తెలుగు భాషా వికాసానికి కేంద్రాలుగా ఉన్నాయి.

# బుర్రకథా పితామహుడు నాజర్





ప్రాచీన జానపద కళారూపమైన బుర్రకథకు కొత్త జీవం పోసి, మెరుగులు దిద్ది, ప్రత్యేక ఆహార్యంతో తగిన హావ భావలతో ఎన్నో ప్రదర్శనలిచ్చి బుర్రకథా ప్రక్రియకు విస్తృత ప్రచారం కల్పించిన బుర్రకథా పితామహుడు నాజర్, నటుడు, ప్రజారచయిత, గాయకుడు. “ ఈ గండపెండేరాలూ, ఊరేగింపులూ, సన్మానాలూ, పద్మశ్రీలూ అన్నీ కలిపి, నాకు జనం వేసే ఒక్క ఈలతో సాటి కాదు” అని తన కళను ప్రజా ప్రయోజనానికే అంకితం చేసిన ప్రజా కళాకారుడు. అంగాంగ విన్యాసాల ద్వారా ఆటపాట ద్వారా జాతిని మేల్కొలిపి ఉత్తేజపరిచిన గొప్ప ప్రతిభాశాలి షేక్ నాజర్.నాజర్ ప్రతిభకు ముగ్ధుడైన సినీ సంగీత దర్శకులు సాలూరు రాజేశ్వరరావు సినీరంగంలో స్థిరపడమని కోరినా, ఆ లోకం తన లోకం కాదని సవినయంగా చెప్పి, జనపదమే తన పథమని బుర్రకథలు చెప్పుకుంటూ జనంతో మమేకమై, జీవితాంతం ప్రజా కళాకారుడిగా కొనసాగిన ప్రజా గాయకుడు నాజర్. బుర్రకథా పితామహుడుగా పేరొందిన షేక్ నాజర్ (ఫిబ్రవరి 5, 1920 – ఫిబ్రవరి 22, 1997) బుర్రకథా కళాకారుడు, నటుడు, ప్రజా రచయిత, గాయకుడు. పద్మశ్రీ అవార్డు గ్రహీత. గుంటూరు జిల్లా పొన్నెకల్లు గ్రామంలో ఓ పేద దూదేకులముస్లిం కుటుంబంలో 1920, ఫిబ్రవరి 5 వ తేదీన షేక్ మస్తాన్, బీబాబీలకు దంపతులకు జన్మించారు. నాజరు పూర్తి పేరు “షేక్ నాజరు వలి”. మహ్మదీయ సభ పేరిట నాటకా లాడి మంచిపేరు గడించారు. ఆయన కృష్ణలీలలో దేవకి, శ్రీ కృష్ణ తులాభారంలో రుక్మిణి, భక్త రామదాసులో ఛాందిని వంటి ఆడవేషాలు వేసి మెప్పించారు. పాదుకా పట్టాభిషేకంలో కైకేయి, ఖిల్జీ రాజ్యపతనంలో కమలారాణి పాత్రలు పోషించారు. పాఠశాల స్థాయిలో “ద్రోణ” పాత్రకు జీవం పోశారు. ఆర్యమత సిద్ధాంతం నచ్చి మాంసాహారం మానేశారు. నాస్తికుడయ్యారు. తెనాలిలోని “బాలరత్న నాటక సమాజం”లో ప్రారంభమైన నాజర్ కథాకథన ప్రస్థానం నాలుగు దశాబ్దాలు సాగింది. కమ్యూనిస్టు పార్టీలోచేరి ప్రజానాట్య మండలి వేదిక ద్వారా పార్టీ సిద్ధాంతాలను కార్యక్రమాలను బుర్రకథల ద్వారా ప్రచారం చేశారు. వీరిని 1940వ దశకంలో కమ్యూనిస్టు పార్టీ నెల జీతం మీద కథలు చెప్పించి పల్లెలలో తమ పార్టీ ప్రచారానికి ఉపయోగించు కున్నది. పల్నాటి యుద్ధం, వీరాభిమన్యు, బొబ్బిలి యుద్ధం, అల్లూరి సీతారామరాజు, ప్రహ్లాద, క్రీస్తు, బెంగాల్ కరువు మొదలగు ఇతివృత్తాలలో నమకాలీన రాజకీయాలు జోడించి బుర్రకథలు రూపొందించారు. పద్మశ్రీ నాజర్ జీవిత చరిత్ర ను అంగడాల వెంకట రమణమూర్తి... పింజారీ అనే పుస్తకం గా ప్రచురించాడు. కొంతకాలం విరసం సభ్యులుగా ఉన్నారు. అగ్గిరాముడు, బలేబావ, నిలువు దోపిడీ, పెత్తందార్లు, పుట్టిల్లు, మనుషులంతా ఒక్కటే – సినిమాల్లో నాజర్ బుర్రకథలు కన్పిస్తాయి. పూల రంగడు సినిమాలో “అక్కినేని”కి నేర్పించారు. చాలా మందికి ఈ గాంధర్వ విద్య నేర్పారు. ఆయన గళ గాంభీర్యాన్ని, మాధుర్యాన్ని గమనించి, “ఆసామీ” నాటకాన్ని రచించారు. ఆంధ్రనాటక కళాపరిషత్తు పోటీల్లో ఆసామీ నాటకం ప్రథమ బహుమతి పొందింది. నాజర్ ఏడుసార్లు జైలు జీవితాన్ని అనుభవించారు. ఆంధ్రనాటక అకాడమీ 1981లో “ఉత్తమ కళాకారుడు” అవార్డుతో సత్కరించింది. 1986 లో భారత ప్రభుత్వం “పద్మశ్రీ” బిరుదుతో నాజరును సత్కరించింది. రంగస్థల మహానటుడు బళ్లారి రాఘవాచార్యులు, నాజరు బుర్రకథ విని అమితానందంతో బళ్లారికి ఆహ్వానించడం, మద్రాసులో ప్రదర్శన చూచిన గోవిందరాజుల సుబ్బారావు నాజరుని అభినందిస్తూ కౌగిలించు కోవడం, ప్రముఖ పాత్రికేయుడు కె. అబ్బాస్ నాజరును “ఆంధ్ర అమరషేక్” అని అభివర్ణించడం కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య నాజరు ప్రజా భాషకు ముగ్ధుడై ”నా బిడ్డడు ఎంత ఎదిగిపోయాడో” అని ఆలింగనం చేసుకోవడం, నాజరు లోని కళా ప్రతిభకు తిరుగులేని నిదర్శనాలు.“నాటకాల్లో బుర్రకథ బ్రహ్మ నాజర్ దగ్గర శిక్షణ తీసుకోవటం నా నట జీవితానికి పట్టం కట్టింది” అని ప్రముఖ నటి జమున వ్యాఖ్యానించారు. గుంటూరుకు ఎన్‌టిఆర్ వచ్చినప్పుడు “నేను మీ అభిమానిని” అని నాజర్ చెపితే... ”నేను మీ ఫాన్‌ను” అని ఎన్‌టిఆర్ చెప్పి అందరినీ ఆనంద పరిచారు. “హరికథకు ఆదిభట్ల ఎలాంటివాడో బుర్రకథకు నాజర్ అలాంటివాడు” అని ముదిగొండ శివప్రసాద్ తదితరప్రముఖుల అభిప్రాయాలు ఉంటే నాజర్ గొప్పతనం స్పష్టం అవుతున్నది. కటిక పేదరికాన్ని మరణించే వరకు అనుభవించిన నాజర్ 1997, ఫిబ్రవరి 22 న అంగలూరులో మరణించారు.

## బయోటెక్నాలజీ రంగానికి మార్గదర్శి పుష్ప మిత్ర భార్గవ

పుష్ప మిత్ర భార్గవ (పి.ఎం. భార్గవ) భారత దేశానికి గర్వకారణమైన శాస్త్రవేత్త, జీవపదార్థ శాస్త్ర (వీశీశ్రీవఓబశ్రీఖతీ దీఱశీశ్రీశీస్త్రవ) రంగంలో ప్రథమశ్రేణి పరిశోధకుడు. భారతీయ జీవశాస్త్ర పరిశోధన అభివృద్ధికి బలమైన పునాదులు వేసిన ఆయన, దేశంలో బయోటెక్నాలజీ రంగానికి మార్గదర్శిగా నిలిచారు.పి.ఎం. భార్గవ 22 ఫిబ్రవరి 1928న అజ్మీర్, రాజస్థాన్‌లో జన్మించారు. బాల్యంలోనే శాస్త్రానికి ఉన్న అభిరుచిని పెంపొందించు కున్నారు. ఆయన లక్నో విశ్వ. విద్యాలయం నుండి రసాయన శాస్త్రంలో ఎంఎస్సీ పూర్తి చేసి, 21వ ఏట (1946లో) అదే యూనివర్సిటీలో కెమిస్ట్రీలో పీహెచ్‌డీ పొందారు.పి.ఎం. భార్గవ సెంటర్ ఫర్ సెల్యూలార్ అండ్ మాలిక్యూలార్ బయోలాజీ (జజవీదీ) ను 1977లో స్థాపించి, దాని తొలి డైరెక్టరుగా పనిచేశారు. భారతదేశంలో జీవపదార్థ శాస్త్ర పరిశోధనకు దారితీసిన ప్రముఖ శాస్త్రవేత్తలలో ఆయన ముఖ్యులు. ఆయన కీలక పరిశోధనలు:డిఎన్‌ఏ ఙ ఆర్ఎన్‌ఏ పై జీవసంబంధమైన ప్రాథమిక అంశాలను విశ్లేషించి, భారత శాస్త్రసంస్థలకు కొత్త మార్గదర్శనం ఇచ్చారు. భారత దేశంలో బయోటెక్నాలజీ అభివృద్ధికి ఆయన చేసిన కృషి అపూర్వం. ఆయుర్వేదం, న్యూరోబయాలజీ మరియు ఔషధ పరిశోధనల్లో కీలకంగా పని చేశారు.పి.ఎం. భార్గవ సామాజిక చైతన్య వేత్తగాను, ప్రభుత్వ పాలసీలపై సలహాదారుగా గాను పనిచేశారు. భారత ప్రభుత్వానికి శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ముఖ్యమైన సూచనలు అందించారు. ఆయన జాతీయ స్థాయిలో డి ఎన్ ఏ ఫింగర్ ప్రింటింగ్, జన్యు సాంకేతిక నియంత్రణ తదితర రంగాల్లో మార్గదర్శకునిగా నిలిచారు.భారత ప్రభుత్వంచే “పద్మ భూషణ్” (1986) పురస్కారంతో సత్కరించబడ్డారు.

# ఈ సూపర్‌ఫుడ్స్‌తో సహజంగా అందాన్ని పెంచుకోండి!



వయసు పెరిగే కొద్దీ మన చర్మం సహజ కాంతిని కోల్పోతుంది. దీంతో మన ఫేస్ డల్‌గా మారుతుంది. ఈ సమస్యను అధిగమించేందుకు చాలా మంది మార్కెట్‌లో దొరికే ఖరీదైన మేకప్ ఉత్పత్తులను వాడుతారు. కానీ మన రోజువారి జీవనశైలిలో, ఆహారపు ఎంపికల్లో కొన్ని మార్పులు చేసుకోవడం వల్ల మన చర్మ కాంతిని ఈజీగా పెంచుకోవచ్చని ఇక్కడ చాలా మందికి తెలియదు. అందంగా కనిపించాలని అందరూ అనుకుంటారు. ఇందకోసం ఖరీదైన ఉత్పత్తుల వాడుతారు. కానీ సరైన ఆహారం తీసుకుంటే మన చర్మం సహజంగా మెరుగుపడుతుందని చాలా మందికి తెలియదు. అవును విటమిన్ సి అధికంగా ఉండే పండ్లు తినడం వల్ల చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఇవి కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచి, పిగ్మెంటేషన్‌ను తగ్గిస్తాయి. అలాగే సూర్మరశ్మి నుంచి చర్మాన్ని రక్షిస్తాయి. కాబట్టి నారింజ, కివి, బొప్పాయి, స్ట్రాబెర్రీలు, బేరి వంటి విటమిన్ సి అధికంగా ఉండే పండ్లను మీకు మంచి ఎంపిక. డ్రై ఫ్రూట్స్: బాదం, వాల్‌నట్‌లు, అవిసె గింజలు, చియా గింజలు చర్మాన్ని మృదువుగా ఉంచడంలో, పొడిబారడాన్ని తొలగించడంలో ప్రభావవంతంగా పనిచేస్తాయి. ఎందుకంటే వాటిలో ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్ ఇ పుష్కలంగా ఉంటాయి. కాబట్టి, ఈ డ్రై ఫ్రూట్స్ అవసరమైన పరిమాణంలో తీసుకోవడం అలవాటు చేసుకోండి. ఆకుకూరలు: పాలకూర, మెంతెం కూర, బ్రోకలీ వంటి ఆకుకూరల్లో ఐరన్, ఫోలేట్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. అవి శరీరాన్ని నిర్విషీకరణ చేసి రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. దీని వల్ల చర్మానికి సహజమైన మెరుపు లభిస్తుంది. కాబట్టి మీ రోజు వారి ఆహారంలో ఆకు కూరలను చేర్చుకోవడం ఉత్తమం. చిలగడదుంప: ఇది కూడా చర్మం సంరక్షణకు చాలా బాగా పనిచేస్తుంది. ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు చర్మాన్ని లోపలి నుండి మెరుగుపరుస్తాయి. చిలగడదుంపలను క్రమం తప్పకుండా తినడం వల్ల చర్మం కాంతి పెరుగుతుంది అలాగే ముడతలు కూడా తగ్గుతాయి. అలాగే దానిమ్మ కూడా చర్మాన్ని ఆరోగ్యాన్ని కాపాడడంతో సూపర్‌గా పనిచేస్తుంది.దానిమ్మను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల చర్మం కాంతి పెరుగుతుంది. అలాగే చర్మంపైఉన్న ఫైన్ లైన్స్ ను తగ్గిస్తుంది. బొప్పాయి: బొప్పాయి రుచికరంగా ఉండటమే కాకుండా మన శరీరానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇందులో ఉండే ఎంజైమ్‌లు జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి, కడుపును శుభ్రంగా ఉంచుతాయి. బొప్పాయి శరీరం నుండి విషాన్ని తొలగించడంలో సహాయపడుతుంది, ఇది మన చర్మంపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుంది. హైడ్రేటింగ్ ఆహారాలు,: దోసకాయలు, పుచ్చకాయలలో నీరు పుష్కలంగా ఉంటుంది, ఇది మీ చర్మాన్ని రోజంతా హైడ్రేట్ గా ఉంచుతుంది. పెరుగు వంటి ప్రోబయోటిక్ ఆహారాలు పేగుతో సహా ఆరోగ్యకరమైన జీర్ణవ్యవస్థను ప్రోత్సహిస్తాయి, అవి మొటిమలకు కారణమయ్యే బ్యాక్టీరియాతో కూడా పోరాడతాయి,ఇవి చర్మ ప్రకాశాన్ని పెంచడంలో సహాయపడతాయి. కాబట్టి వీటిని మీ రోజువారి ఆహారంలో చేర్చుకోవడం ద్వారా మీరు సహజంగా అందాన్ని పెంచుకోవచ్చు.

# చికెన్ కుర్మా ఇలా చేస్తే.. పక్కింటోళ్లు కూడా మీ ఇంట్లో వాలిపోతారు?



ఎప్పుడూ రొటీన్ చికెన్ కుర్మా ఏం తింటారు. ఈ రోజు కొత్తగా బెంగాలీ స్టైల్ చికెన్ కుర్మా ట్రై చేయండి . దీనిని ఆంధ్ర, తెలంగాణలో ఎంతో ఇష్టంగా తింటారు. అయితే, ఇప్పుడు బెంగాలీ స్టైల్లో చికెన్ కుర్మాని ఎలా తయారు చేయాలో ఇక్కడ తెలుసుకుందాం. ఇది అన్నంలోకి మరింత రుచిగా ఉంటుంది.

**కావాల్సిన పదార్థాలు :** ముప్పావు కిలో చికెన్, గ్రాములు 3 బంగాళాదుంపలు, 2 పెద్ద ఉల్లిపాయలు, 5 చిన్న టమోటాలు, 3 టేబుల్ స్పూన్స్ అల్లం వెల్లుల్లి పేస్ట్, 5 ఘాటు మిర్చి, బిర్యానీ ఆకు- 4, ఒక టేబుల్ స్పూన్ మిరియాలు, 5 లవంగాలు 5 దాల్చిన చెక్క, అర టీ స్పూన్ పసుపు,ఒక టేబుల్ స్పూన్ ధనియాల పొడి, ఒక టేబుల్ స్పూన్ మసాలా పొడి, ఒక టేబుల్ స్పూన్ పంచదార, కొత్తిమీర, 5 టేబుల్ స్పూన్స్ నూనె, రుచికి తగినంత ఉప్పు.

ముందుగా స్టవ్ వెలిగించి పాన్ పాన్ పెట్టి దానిలో ఆయిల్ వేసి వేడయ్యాక వేడి చేయాలి. ఇక ఇప్పుడు బంగాళాదుంపను తీసుకుని చిన్న చిన్న ముక్కలుగా చేసి పక్కన పెట్టుకోవాలి. ఆ తర్వాత ధనియాలు, లవంగాలు అన్ని తీసుకుని పొడి లాగా పట్టుకోవాలి. ఇక ఇప్పుడు పాన్ పెట్టి దానిలో ఆయిల్ వేసి అది వేడయ్యాక ఉల్లిపాయ ముక్కలు, జీడిపప్పులు గోల్డ్ కలర్ వచ్చే వరకు వేయించాలి. ఇక ఇప్పుడు ముందుగా చేసి పెట్టుకున్న చికెన్ ను తీసుకుని బాగా వేయించి ఆ తర్వాత దానిలో బంగాళాదుంప ముక్కలు , పచ్చిమిర్చి వేసి మీడియం మంటపై 10 నిమిషాల పాటు స్టవ్ మీదనే ఉంచి ఉడికించాలి. గ్రేవీ కావాలనుకునే వారు రెండు గ్లాస్ లు నీళ్ళు పోసి రుచికి తగినంత ఉప్పు వేసి టేస్ట్ చూసి ఏమైనా తక్కువ అనిపిస్తే వాటిని వేసి మూత పెట్టేసి చికెన్ ఉడికే వరకు బాగా ఉడికించండి. చికెన్ ఉడికిన తర్వాత మూత తీసి రెండు స్పూన్స్ పంచదార వేస్తే రుచి అదిరిపోతుంది. ఇది వేశాక తియ్యగా ఉంటుంది కదా అని సందేహిస్తున్నారా? తియ్యగా ఉన్నా కూడా మీ నోటికి కొత్త రుచి తగులుతుంది. దించే ముందు కొత్తిమీర ఆకులు వేసి దించేయండి. అంతే, వేడి వేడి బెంగాలీ స్టైల్ చికెన్ కుర్మా రెడీ.

# లేత వయసులోనే తెల్లజుట్టుతో పెద్దవారిలా కనిపిస్తున్నారా?



తెల్ల జుట్టు వృద్ధాప్యానికి సహజ సంకేతం. కానీ ఇప్పుడు చాలా మందికి ఇరవైలలో కొందరికి అంతకంటే ముందుగానే జుట్టు తెల్లబడిపోతుంది. ఇది శరీరంలో దాగి ఉన్న తీవ్రమైన అనారోగ్యానికి సంకేతమా అని చాలా మంది ఆందోళన చెందుతుంటారు. ఎప్పుడో 60 ఏళ్లకు రావల్సిన తెల్ల జుట్టు నేటి కాలంలో లేత వయసులోనే పలకరిస్తుంది. తెల్ల జుట్టు వృద్ధాప్యానికి సహజ సంకేతం. కానీ ఇప్పుడు చాలా మందికి ఇరవైలలో కొందరికి అంతకంటే ముందుగానే జుట్టు తెల్లబడిపోతుంది. ఇది శరీరంలో దాగి ఉన్న తీవ్రమైన అనారోగ్యానికి సంకేతమా అని చాలా మంది ఆందోళన చెందుతుంటారు. అన్ని సందర్భాల్లో కాదుగానీ కొన్ని సందర్భాల్లో చిన్న వయస్సులోనే జుట్టు నెరవడం శరీరంలోని ఆరోగ్య సమస్యకు హెచ్చరిక సంకేతంగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. జుట్టు రంగు మెలనిన్ అనే వర్ణద్రవ్యం మీద ఆధారపడి ఉంటుంది. వయస్సుతో పాటు ఈ వర్ణద్రవ్యం తగ్గడం సాధారణం. కానీ ఈ ప్రక్రియ చిన్న వయస్సులోనే ప్రారంభమైతే దాని వెనుక అనేక ఆరోగ్య కారణాలు ఉండవచ్చు. ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ ట్రైకాలజీలో ప్రచురితమైన 2018 అధ్యయనంలో జుట్టు అకాలంగా తెల్లబడటానికి గల ముఖ్య కారణాల్లో విటమిన్ ః12 లోపం ఒకటి. బీ12 విటమిన్ సాధారణ స్థాయిల కంటే తక్కువగా ఉంటుంటే చిన్న వయసులోనే జుట్టు తెల్లబడుతుంది. ఈ విటమిన్ లోపం వల్ల జుట్టు అకాలంగా తెల్లబడి వృద్ధాప్యం వేగంగా వచ్చినట్లు అనిపిస్తుంది. థైరాయిడ్ హార్మోన్ల సమతుల్యత చెదిరిపోతే, జుట్టు సాధారణ పెరుగుదల, రంగు ప్రభావితమవుతుందని ఓ పరిశోధనలో తేలింది. హైపోథైరాయిడిజం జుట్టు త్వరగా తెల్ల రంగులోకి మారే ధోరణితో ముడిపడి ఉంటుంది. డెర్మటాలజీ రీసెర్చ్ అండ్ ప్రాక్టీస్‌లో ప్రచురితమైన సమాచారం ప్రకారం విటిలిగో, అలోపేసియా అరేటా వంటి ఆటో ఇమ్యూన్ వ్యాధులు జుట్టు వర్ణద్రవ్యం కణాలను దెబ్బతీస్తాయి. ఫలితంగా జుట్టు అకాలంగా తెల్ల రంగులోకి మారుతుంది. 2020లో నేచర్ జర్నల్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనంలో దీర్ఘకాలిక ఒత్తిడి శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడిని పెంచుతుందని, ఇది జుట్టు రంగుకు కారణమైన మూల కణాలను నాశనం చేస్తుందని పేర్కొంది. అంతేకాకుండా ఒత్తిడి నేరుగా జుట్టు రాలడానికి కూడా కారణమవుతుంది.వైద్యుల అభిప్రాయం ప్రకారం ఆలస్యంగా నిద్ర లేవడం, అనారోగ్యకరమైన ఆహారం, ధూమపానం, కాలుష్యం, రసాయనాలతో కూడిన హెయిర్ ఉత్పత్తులను అధికంగా ఉపయోగించడం వల్ల జుట్టు ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. అయితే అన్ని సందర్భాల్లోనూ జుట్టు తెల్లబడటం అనేది శరీరంలో అంతర్లీనంగా దాగి ఉన్న పెద్ద వ్యాధి కాదని గుర్తుంచుకోవడం ముఖ్యం. కొన్నిసార్లు ఇది వంశపారంపర్యంగా లేదా సహజంగా కూడా సంభవిస్తుంది. అయితే జుట్టు తెల్లబడటం అనేది అసాధారణ అలసట, జుట్టు రాలడం, బరువు తగ్గడం, హార్మోన్ల సమస్యలతో కూడి ఉంటే వీలైనంత త్వరగా డాక్టర్‌ను సంప్రదించి సంబంధిత రక్త పరీక్షలు చేయించుకోవాలి. తద్వారా సమస్యను తొలినాళ్లలోనే గుర్తించి సరైన చికిత్స అందించేందుకు వీలవుతుంది.



# సిగరెట్ తాగే అలవాటు ఉందా?

ఒత్తిడి తగ్గించుకోవడానికి సిగరెట్ తాగుతున్నారా? టెన్షన్‌లో ఉన్నప్పుడు పొగ వదిలితే రిలాక్సేషన్ వస్తుందని అనుకుంటున్నారా? అయితే మీరు పెద్ద పొరపాటే చేస్తున్నారు. మీరు పీల్చే ఆ పొగ ఒత్తిడిని తగ్గించకపోగా, మిమ్మల్ని మానసిక ఆందోళనలోకి నెట్టేస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అసలు సిగరెట్ తాగినప్పుడు మెదడులో ఏం జరుగుతుంది? ఆఫీసులో పని ఒత్తిడి పెరిగినా, ఏదైనా టెన్షన్ వచ్చినా వెంటనే సిగరెట్ వెలిగించడం చాలా మందికి అలవాటు. ధూమపానం చేస్తే మనసు ప్రశాంతంగా ఉంటుందని, ఒత్తిడి తగ్గుతుందని చాలా మంది నమ్ముతుంటారు. కానీ ఇది పూర్తిగా అపోహ అని, వాస్తవానికి ధూమపానం ఒత్తిడిని తగ్గింకపోగా మరింత పెంచుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. సిగరెట్లలో ఉండే నికోటిన్ ఊపిరితిత్తుల ద్వారా కేవలం కొన్ని సెకన్లలోనే మెదడుకు చేరుకుంటుంది. ఇది శరీరంలో డోపమైన్ అనే ఫీల్ గుడ్ హార్మోన్‌ను విడుదల చేస్తుంది. దీనివల్ల కొద్ది నిమిషాల పాటు ఏదో తెలియని ఆనందం, హాయిగా ఉన్నట్లు అనిపిస్తుంది. ఈ తాత్కాలిక అనుభూతిని చూసి ధూమపానం ఒత్తిడిని తగ్గిస్తుందని భ్రమపడుతుంటారు. ఢిల్లీలోని లంగ్స్ వెల్నెస్ సెంటర్‌కు చెందిన డాక్టర్ నేహా వధేరా దీనిపై కీలక వివరణ ఇచ్చారు. నికోటిన్ ఇచ్చే ఆ ప్రశాంతత కేవలం కొన్ని నిమిషాలు మాత్రమే ఉంటుంది. శరీరంలో నికోటిన్ ప్రభావం తగ్గగానే, మళ్లీ సిగరెట్ తాగాలనే కోరిక మొదలవుతుంది. దీనివల్ల మునుపటి కంటే ఎక్కువ విశ్రాంతి లేకపోవడం, చిరాకు, ఆందోళన పెరుగుతాయి. దీర్ఘకాలంలో ధూమపానం చేసేవారిలో మానసిక ఒత్తిడి స్థాయిలు సాధారణం కంటే ఎక్కువగా ఉంటాయని పరిశోధనలు చెబుతున్నాయి.

# యాసంగి సాయంపై నీలినీడలు..

**సీజన్ ప్రారంభమై మూడు నెలలు దాటినా పట్టించుకోని ప్రభుత్వం**
**2023 వానకాలం సీజన్ వరకు కేసీఆర్ ప్రభుత్వం అందించిన రైతుబంధు వివరాలు**
**నేటికీ అందని 'రైతు భరోసా'**
**నిర్మల్ జిల్లావ్యాప్తంగా 1,88,597 మంది రైతుల ఎదురుచూపు**
**అన్నదాతను వెంటాడుతున్న ఆర్థిక కష్టాలు**
**అప్పుల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్న రైతులు**



**నిర్మల్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. ఎన్నికలకు ముందు అలవికాని హామీలిచ్చి అందలమెక్కిన తర్వాత సబ్బండ వర్గాల ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. రైతులను నట్టేట ముంచింది. ఒకవైపు యూరియా కష్టాలు, మరోవైపు పంట పెట్టుబడి సాయం అందకపోవడంతో రైతులు కష్టాల సాగును కొనసాగిస్తున్నారు. అటు బ్యాంకులు సహకరించక పోతుండడం, ఇటు ప్రభుత్వం కనికరించకపోవడంతో వారంతా మళ్లీ ప్రైవేటు అప్పుల బాట పడుతున్నారు. ఇప్పటికే చాలా మంది రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పులు తీసుకొని సాగు చేస్తున్నారు. వీరంతా గత సీఎం కేసీఆర్‌ను దేవుడిలా అభివర్ణిస్తూ తమ సాగుకు ఆర్థిక సాయం చేసి ఆదుకున్నాడని గుర్తు చేసుకుంటున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లపాటు ప్రతి సీజన్‌కు ముందే పెట్టుబడి సాయం అందించి అప్పుల ఊబిలో కూరుకుపోయిన అన్నదాతలను ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేసింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు పేరును రైతుభరోసా అని మార్చిందే గాని, అమలు చేయడంలో మాత్రం కుంటి సాకులు వెతుకుతున్నది. అప్పట్లో కేసీఆర్ ప్రభుత్వం ఎకరాకు ఏడాదికి రూ.10 వేలు ఇవ్వగా, అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎకరాకు రూ.15వేలు ఇస్తామని హామీ ఇచ్చి, అమలులోకి వచ్చే సరికి రూ.12 వేలుగా నిర్ణయించింది. అయితే దానిని కూడా అమలు చేయడంలో తీవ్ర జాప్యం చేస్తున్నది. ప్రస్తుత యాసంగి సీజన్ ప్రారంభమై దాదాపు మూడు నెలలు కావస్తున్నా నేటికీ రైతుభరోసా అందకపోవడంతో రైతులు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 1,88,597 మంది రైతులు రైతు భరోసా కోసం ఎదురు చూస్తున్నారు. వీరికి పెట్టుబడి సాయం కింద రూ.268.85 కోట్లు విడుదల చేయాలి. మున్సిపల్ ఎన్నికలు ముగియగానే రైతు భరోసా అందజేస్తామని కొన్ని రోజులుగా ప్రభుత్వ పెద్దల నుంచి ప్రకటనలు వస్తున్నాయే తప్ప అవి ఆచరణకు నోచుకోవడం లేదు. ఎన్నికలు ముగిసి వారం రోజులవుతున్నా ప్రభుత్వం రైతు భరోసా ఊసెత్తడం లేదు. త్వరలోనే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉండడంతో రైతుభరోసా నిధుల విడుదలపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ప్రాదేశిక ఎన్నికల కోడ్‌ను బూచిగా చూపి ఈ యాసంగి సీజన్ భరోసా డబ్బులు ఎగవేసేందుకు ప్రభుత్వం యత్నిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### 3 లక్షల ఎకరాల్లో సాగు

ప్రస్తుత యాసంగి సీజన్‌లో నిర్మల్ జిల్లా వ్యాప్తంగా రైతులు దాదాపు 3 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. అధికారుల నివేదిక ప్రకారం 1.10 లక్షల ఎకరాల్లో వరి, 1.02 లక్షల ఎకరాల్లో మక్క, 35 వేల ఎకరాల్లో జొన్న, 55 వేల ఎకరాల్లో శనగ సాగు చేసినట్లు చెబుతున్నారు. ఆయా పంటల సాగు కోసం అవసరమైన పెట్టుబడి ఖర్చులను ప్రభుత్వం ఇవ్వకపోవడంతో చాలా మంది రైతులు అప్పులు చేసి సాగు చేస్తున్నారు. రైతు భరోసా డబ్బులు అందితే చేసిన అప్పులు తీర్చవచ్చనే ఆలోచనతో రైతులు ఎదురు చూస్తున్నారు. ఈ యాసంగికి రైతు భరోసా డబ్బులను ఇస్తామని ప్రకటనలు చేస్తున్నారే తప్ప ప్రభుత్వ పెద్దల నుంచి ఎలాంటి స్పష్టత లేకపోవడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి రెండు సీజన్లలో ఇస్తామని చెప్పి ఇవ్వకుండా మోసం చేసింది. అలాగే గత వానకాలం సీజన్‌లో అనేక ఆంక్షలు అమలు చేసి అరకొర సాయాన్ని అందజేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. రైతు భరోసా అమలు కోసం కొత్త నిబంధనలు రూపొందించాలని, అర్హులకే ఇవ్వాలని, గతంలో అవకతవకలు జరిగాయంటూ వట్టి మాటలు చెప్పి రైతులను మభ్యపెట్టేందుకు పాలకులు యత్నిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇటీవల వ్యవసాయ మంత్రి ఏ భూములు సాగయ్యాయో తెలుసుకునేందుకు శాటిలైట్ ద్వారా పరిశీలించిన తర్వాతనే రైతు భరోసా సాయాన్ని అందిస్తామని ప్రకటించారు. ఈ మేరకు సాగు భూములను సర్వే చేసిన అధికారులు ఎందరికి కోత పెడతారోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. చేతిలో పెట్టుబడి సాయం లేకపోవడంతో రైతులు వడ్డీలకు అప్పులు తీసుకొచ్చి సాగు చేస్తున్నారు. ఇప్పటికైనా రైతులకు ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా కింద పంట పెట్టుబడి సాయాన్ని అందించి ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

# రైతు భరోసా ఇంకెప్పుడు?



**కరీంనగర్ :** తెలంగాణ రాక ముందు తొలకరి వచ్చిందంటే ఎంతో మంది రైతులు పెట్టుబడి కోసం అరిగోస పడేది. చేతిలో చిల్లిగవ్వ లేక బ్యాంకుల చుట్టూ తిరేగిది. అక్కడ రుణం రాక వడ్డీ వ్యాపారులను ఆశ్రయించేంది. పంట దిగుబడి చేతికి రాగానే అమ్మి.. అసలు వడ్డీ కట్టేది. మళ్లీ సీజన్ రాగానే కథ పునరావృతమయ్యేది. స్వరాష్ట్రంలో ఈ పరిస్థితి మారింది. సరైన పెట్టుబడి ఉంటే రైతులు నిరందీగా పంటలు పండించగలుగుతారని భావించిన కేసీఆర్ సర్కారు, 'రైతుబంధు' అమలు చేసింది. ప్రతి ఎకరాకు ఏడాదికి 10 వేల ఆర్థిక సహాయాన్ని అందించింది. సీజన్ ప్రారంభంలోనే ఖాతాల్లో నగదు జమ చేయడంతో రైతులకు పెట్టుబడి భారం తప్పింది. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసుకొని, నిశ్చితంగా సాగు చేసుకునేది. కానీ, కాంగ్రెస్ సర్కారు వచ్చిన తర్వాత పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. రైతు భరోసా అమలుకు కాంగ్రెస్ సర్కారు ఆపసోపాలు పడుతున్నది. తరచూ ఇప్పుడూ అప్పుడూ అంటూ వాయిదాల మీద వాయిదాలు వేస్తున్నది. సకాలంలో ఇవ్వకుండా రైతులను గోస పెడుతున్నది. సీజన్ ప్రారంభంలో వేయాల్సిన పంట పెట్టుబడిని సంక్రాంతికి వేస్తామని చెప్పి దాటవేసింది. ఆ తర్వాత జనవరి 26న ఖాతాల్లో జమ చేస్తామని చెప్పి మరోసారి మాట తప్పింది. ఇప్పుడు ఎప్పుడిస్తారో తెలియని గందరగోళ పరిస్థితి ఉండగా, పరిషత్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆపుతున్నట్టు తెలుస్తున్నది. ప్రస్తుత పరిణామాలను చూస్తే ఎన్నికలకు ముందు రైతు భరోసా ఇచ్చి ఓట్లు పొందాలనే ఆలోచనలో ఉన్నట్టు అర్థమవుతున్నది. ఈ ఎన్నికలు జరిగేదెప్పుడు తమకు రైతు భరోసా వచ్చేదెప్పుడని రైతులు నిరాశకు గురవుతున్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోని సర్కారు తీరుపై మండిపడుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసా పథకానికి తూట్లు పొడుస్తున్నది. పథకం పేరు మార్చి ఎకరాకు ఏడాదికి 12 వేలు ఇస్తామని చెప్పినా.. అమలులో మాత్రం తీవ్ర జాప్యం చేస్తున్నది. అనేక సాకులు చూపి వేలాది మంది రైతులను ఈ పథకం నుంచి తప్పించింది. సాగుయోగ్యత లేని భూములపై ముందుగా అధికారులతో సర్వే చేయించిన సర్కారు, కరీంనగర్ జిల్లాలో 5,476 ఎకరాలను తొలగించింది. ఇప్పుడు సాగు చేసిన భూములకు మాత్రమే ఇస్తామని చెబుతూ.. శాటిలైట్ సర్వే ద్వారా ఇమేజ్ మ్యాపింగ్ చేసి అర్హులైన రైతులను ఎంపిక చేస్తామని మెలిక పెట్టింది. నిజానికి ఈ యాసంగి సీజన్ ప్రారంభంలో అంటే గత అక్టోబర్, నవంబర్‌లోనే రైతు భరోసా అందాల్సి ఉంది. అప్పుడు సంక్రాంతి వరకు ఇస్తామని మభ్యపెట్టింది. కానీ, ఇవ్వకుండా.. జనవరి 26కు వాయిదా వేసింది. ఆ గడువు కూడా దాటిపోయింది. అసలు రైతు భరోసా ఇస్తారా.. ఇవ్వారా..? అనేది ఎక్కడా స్పష్టత లేదు. అధికారులను అడిగినా కచ్చితమైన సమాధానం రావడం లేదు. జనవరి నుంచి అధికారుల నుంచి ఇదే సమాధానం వస్తున్నది. కానీ ఎప్పుడిస్తారనేది మాత్రం ఎవరూ చెప్పడం లేదు. ఈ నేపథ్యంలో రైతులు తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. వస్తుందనే నమ్మకాన్ని కూడా కోల్పోతున్నారు.

### సకాలంలో అందింది లేదు

కాంగ్రెస్ తన ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడం లేదు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసా కింద ఎకరాకు ఏడాదికి 15 వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు మాట మార్చింది. కేవలం 12 వేలు ఇస్తామని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ఏ ఒక్క సీజన్‌లో కూడా సకాలంలో అందించ లేకపోయారు. అందినా అర్హులైన రైతులందరికీ ఇవ్వలేకపోయారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 2023-24 యాసంగి సీజన్ మొదటి సారి వచ్చింది. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కేటాయించిన నిధులనే ఎకరాకు 5వేల చొప్పున వచ్చింది. 2024 వానకాలంలో పూర్తిగానే ఎగ్గొట్టింది. 2024-25 యాసంగిలో మాత్రం మూడెకరాలు ఉన్న రైతుల వరకే ఇచ్చింది. అంతకు ఎక్కువ ఉన్న రైతులకు మొండిచేయి చూపింది. 2025 వానకాలంలో మాత్రం పంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పూర్తి స్థాయిలో ఇచ్చింది. ఇప్పుడు యాసంగి సీజన్ వచ్చే సరికి సాగు చేసిన భూములకే మాత్రమే రైతు భరోసా ఇస్తామని రాష్ట్ర సర్కారు చెబుతున్నది. అందుకు శాటిలైట్ సర్వే ద్వారా ఇమేజ్ మ్యాపింగ్ చేసి అర్హులను నిర్ణయిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ప్రకటించారు. కానీ, యాసంగి సీజన్ మధ్యకు వచ్చినా ఈ దిశగా ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకున్నట్టు కనిపించడం లేదు..

### భారం తగ్గించుకుంటున్న సర్కారు

రైతు భరోసాపై రైతుల్లో తీవ్రమైన గందరగోళం నెలకొన్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్క సీజన్‌లో కూడా రైతులకు సకాలంలో రైతు భరోసా అందించ లేక పోయింది. నాట్ల సమయంలో ఇవ్వాల్సిన భరోసాను కోతల సమయంలో ఇవ్వడంతో సాగు అసరాలకు వినియోగించు కోలేని పరిస్థితి ఏర్పడుతున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వానకాలం పంటలకు ఏప్రిల్, మేలో.. యాసంగి పంటలకు అక్టోబర్, నవంబర్‌లో రైతుల బ్యాంకు ఖాతాల్లో రైతుబంధు జమయ్యేది. కాంగ్రెస్ పాలనలో అసలు సకాలంలో అందకపో వడం ఒక ఎత్తయితే.. వచ్చినప్పుడు కూడా అర్హులైన రైతుల్లో చాలా మందికి అందడం లేదు. 2024-25 యాసంగి సీజన్‌లో జిల్లాలోని అనేక మంది అర్హులైన రైతుల ఖాతాల్లో రైతు భరోసా జమ కాకపోవడమే అందుకు నిదర్శనం. ఆ సీజన్‌లో కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 2,09,450 మంది రైతులను అర్హులుగా గుర్తించి 213.95 కోట్లు కేటాయించారు. కానీ, కేవలం 1,95,945 మంది వివరాలు మాత్రమే అధికారుల వద్ద ఉండగా వాటిని మాత్రమే ట్రెజరీకి పంపించారు. మిగిలిన 13,505 మందికి అన్యాయం జరిగింది. అంతే కాకుండా భూభారతి (ధరణి) పోర్టల్లో భూములు నమోదై ఉన్న రైతులకు కూడా రైతు భరోసా అందలేదు. సాగు యోగ్యమైన భూముల సర్వే చేసినప్పుడు అధికారులు రీ సర్వే సెటిల్‌మెంట్ రిజిస్టార్ (ఆర్ఎస్ఆర్)లో నమోదు చేశారు. అందులో విస్తీర్ణం తక్కువ ఉండి, పట్టాదారు పాసు పుస్తకంలో ఎక్కువ ఉన్న రైతులకు ప్రభుత్వం మొండి చేయి చూపింది. అంతేకాకుండా పట్టాదారు పాసు పుస్తకంలో ఉన్న పూర్తి స్థాయి భూమికి రైతు భరోసా అందలేదు. రైతు భరోసా అమలుకు క్రాప్ బుకింగ్ పోర్టల్‌ను కూడా పరిగణలోకి తీసుకున్నారు. ఒకట్రెండు సీజన్లలో పంటలు సాగు చేయకుంటే ఖాళీగా చూపించారు. ఆ తర్వాత సాగు చేసినా వారికి కూడా ఇవ్వలేదు. ఇలాంటి సాంకేతిక సమస్యలు ఎదుర్కొంటున్న రైతులు జిల్లాలో 16 వేలకుపైనే ఉన్నట్టు తెలుస్తున్నది. వీటిని పరిష్కరించాలనే ఆలోచనలో ప్రభుత్వం కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో ఎంత తక్కువ విస్తీర్ణానికి రైతు భరోసా ఇస్తే అంత ఆదా అవుతుందనే ధోరణిలో ప్రభుత్వం కనిపిస్తున్నది. అందుకు అనేక సాకులు వెతుకుతోందనే అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి.

### పరిషత్ ఎన్నికలకు లింక్?

రైతు భరోసాను రాష్ట్ర ప్రభుత్వం రాజకీయంగా వాడుకోవాలని చూస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. నిజానికి ఈ యాసంగి సీజన్‌కు గతేడాది అక్టోబర్, నవంబర్‌లోనే రైతు భరోసా ఇవ్వాల్సి ఉంది. కుంటి సాకులు చెబుతూ వాయిదాల మీద వాయిదాలు వేస్తున్న ప్రభుత్వం ఈ పథకాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవాలని చూస్తున్నదనే ఆరోపణలు వస్తున్నాయి. వచ్చే జిల్లా, మండల ప్రజా పరిషత్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నోటిఫికేషన్‌కు ముందు రైతు భరోసా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలుస్తున్నది. ఇదే నిజమైతే ఈ ఎన్నికలపై ఇప్పటి వరకు స్పష్టత లేదు. తమకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతనే ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వాలని మరోపక్క బీసీలు ఉద్యమించే పరిస్థితి కనిపిస్తున్నది. ఈ నేపథ్యంలో ఎన్నికలకు ముడిపెట్టి తమను ఎందుకు ఇబ్బందులు పెడతారని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం అనేక సార్లు వాయిదాలు వేసిందని, ఇప్పుడు సీజన్ పూర్తికాక ముందైనా ఇవ్వాలని కోరుతున్నారు.

## సుంకాల పేరుతో ప్రపంచ దేశాలను బెదిరిస్తున్న అమెరికా : సీపీఐ




**తాండూర్ :** అమెరికా దేశం సుంకాల పేరుతో ప్రపంచ దేశాలను బెదిరింపులకు గురిచేస్తుందని సీపీఎం పార్టీ మంచిర్యాల జిల్లా కమిటీ సభ్యుడు దాగాం రాజారాం ఆరోపించారు. సీపీఎం తాండూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని భగత్ సింగ్ భవన్ లో రెడ్ బుక్ డేను నిర్వహించారు. అమెరికా సామ్రాజ్యవాదం అనే పుస్తకంపై నిర్వహించిన పుస్తక పఠనంలో ఆయన మాట్లాడారు. సామ్రాజ్యవాద దురగతాలను ఎండగట్టాలి అనే ఉద్దేశ్యంతో 1948 ఫిబ్రవరి 21న లండన్‌లో ముద్రితమైన కమ్యూనిస్టు ప్రణాళిక మేనిఫెస్టో విడుదలై ప్రకంపనలను సృష్టించిందని పేర్కొన్నారు. భారత దేశం పైన సుంకాలు విధించి హెచ్చరికలు చేసిందని తెలిపారు. రష్యా, చైనాలు దీటుగా సమాధానాలు చెబుతుండగా, పెద్ద ప్రజాస్వామ్య దేశమని చెప్పుకునే మనం మోదీ నాయకత్వాన,ఒక్క మాట మాట్లాడటం లేదని ఆరోపించారు. అమెరికా సామ్రాజ్య వాదానికి తలొగ్గి దేశ ప్రయోజనాలను, ప్రతిష్టను తాకట్టు పెడుతున్నదని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుర్గం నానయ్య, చెల్పుల శంకర్, బొల్లం రాజేశం, సోమ మొగిలి, లింగం బానేష్, నాయకులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి జిల్లా కళాకారుల అభ్యున్నతికి సమర శంఖం.. గోదావరిఖనిలో సన్నాహక సమావేశం




**కోల్ :** ఎన్నికలకు ముందు కళాకారులకు ఇచ్చిన వాగ్దానాలు... హామీలు సాధించే దిశగా సమర శంఖం పూరిస్తున్నట్లు ప్రముఖ కళాకారులు స్పష్టం చేశారు. పెద్దపల్లి జిల్లాలోని వివిధ కళా రంగాల్లో నిష్ణాతులైన 24 విభాగాల కళాకారుల అభ్యున్నతికి కళాతోరణం ముందడుగు వేయడం శుభ సూచికమని పలువురు కళాకారులు అభిప్రాయ పడ్డారు. గోదావరిఖని మార్కండేయ కాలనీలోని స్నేహ సాహతీ గ్రంథాలయంలో ఆదివారం కళాతోరణం ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం జరిగింది. జిల్లాలోని 24 విభాగాలకు చెందిన కళాకారులు హాజరయ్యారు. కళాకారుల సంక్షేమం, ఐక్యత, హక్కుల పరిరక్షణ లక్ష్యంగా కార్యచరణ రూపొందించుకున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రభుత్వం కళాకారులకు ఇచ్చిన హామీలు, గ్యారంటీలను అమలు చేసే విధంగా కళాతోరణం బాధ్యత తీసుకొని ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని కళాకారులు ఐక్యంగా ఉంటేనే ఏదైనా సాధ్యపడుతుందని పేర్కొన్నారు. అనంతరం జనగామ తిరుపతి ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ను అవిష్కరించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సీనియర్ కళాకారుడు సత్యనారాయణకు నివాళులర్పించారు. మంచిర్యాల జిల్లాల కళాకారులు శ్రీనివాస్, గంగ భవానీలు పాల్గొని ఈ ప్రాంత కళాకారుల ఐక్యత తమకు ఆదర్శమని కొనియాడారు. ఈ సమావేశంలో కళాకారులు అశోక్ వేముల, బడికెల గణేశ్, జక్కిని శ్రీలత నేత, మేకల శ్రీకాంత్, వేణుగోపాల్, నిర్మాతల సంఘం అధ్యక్షులు కొమ్ము కుమార్, సీనియర్ కళాకారులు దామెర శంకర్, శంకర్, సత్యవతి, రాజేశ్, మహేశ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మ్యాడారం తండాలో సంతు సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు



**సారంగాపూర్ :** సారంగాపూర్ మండలంలోని మ్యాడారం తండా గ్రామంలో ఆదివారం బంజారాలా ఆరాధ్య దైవం శ్రీశ్రీశ్రీ సంతు సేవాలాల్ మహారాజ్ 287 జయంతి భోగి బండార్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంతు సేవాలాల్ చిత్రపటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దురాచారాలను అపోహలను ఆశాస్త్రీయమైన అపోహలను నమ్ముతు జీవిస్తున్న బంజారా జాతులను తన ఆలోచనలు ప్రసంగాలతో చైతన్యపర్చిన వ్యక్తి సేవాలాల్ మహారాజ్ అని గిరిజనులు సంతు సేవాలాల్ సేవలను స్మరించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ భుక్య భారతి చిరంజీవి, ట్రాన్స్ కో ఏడీఈ భుక్య జవహార్ లాల్ నాయక్, ఉప సర్పంచ్ గుగులోతు కిషన్, గ్రామ కార్యదర్శి రవి, గిరిజన నాయకులు, బంజార యూత్ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మస్కట్లో బొమ్మెన వాసి మృతి



**కథలాపూర్ :** కథలాపూర్ మండలం బొమ్మెన గ్రామానికి చెందిన లోలపు శ్రీనివాస్ (40) అనే వ్యక్తి మస్కట్ దేశంలో అనారోగ్యంతో మృతిచెందినట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీనివాస్ స్థానికంగా దినసరి కూలీగా పనిచేశారు. అయినప్పటికి కుటుంబ పోషణ గడవడం కష్టంగా మారింది. శ్రీనివాస్ ఉపాధి నిమిత్తం మూడు నెలల క్రితం మస్కట్ దేశం వెళ్లగా అక్కడ అనారోగ్యంతో బాధపడుతుంటే తోటి మిత్రులు ఆసుపత్రిలో చేర్పించి చికిత్సలు చేయిం చారు. చికిత్స పొందుతూ మూడు రోజుల క్రితం మృతిచెందినట్లు కుటుంబసభ్యులకు ఆదివారం సమాచారం అందింది. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహం స్వగ్రామానికి పంపించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని బాధిత కుటుంబసభ్యులు కోరుతున్నారు.

# బిజినెస్

## ఆ ఐటీ కంపెనీ ఉద్యోగుల్లో ఫుల్ జోష్




దేశంలో అతిపెద్ద ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌లో (టీసీఎస్) పనిచేసే ఉద్యోగుల్లో ఫుల్ జోష్‌లో ఉన్నారు. కారణం.. మధ్య, సీనియర్ స్థాయి ఉద్యోగుల త్రైమాసిక వేరియబుల్ పేను మూడో త్రైమాసికంలో గరిష్ఠంగా 80 శాతం వరకు పెంచింది. దాదాపు రెండేళ్లుగా తక్కువ స్థాయిలో కొనసాగిన చెల్లింపుల తరువాత ఇది గణనీయమైన మార్పుగా భావిస్తున్నారు. ఇటీవలి కాలంలో మధ్య, సీనియర్ స్థాయి సిబ్బందికి వేరియబుల్ పే 20--50 శాతం మధ్యకే పరిమితమై ఉండేది. ఇప్పుడు అక్టోబర్--డిసెంబర్ త్రైమాసికానికి సంబంధించి చాలామంది మధ్యస్థాయి ఉద్యోగులు సుమారు 80 శాతం వేరియబుల్ చెల్లింపులు పొందినట్లు సమాచారం. సీనియర్ స్థాయి ఉద్యోగులకు 40--80 శాతం మధ్య చెల్లింపులు జరిగినట్లు తెలిసింది. 'మనీ కంట్రోల్' కథనం ప్రకారం.. ఉద్యోగులకు జనవరిలో ఈ మొత్తాలు జమయ్యాయి. కంపెనీ వర్గాల ప్రకారం.. మొత్తం ఉద్యోగుల్లో 70 శాతం మందికి పైగా తమ త్రైమాసిక వేరియబుల్ వేతనంలో 100 శాతం అందుతోంది. అయితే, పూర్తి చెల్లింపులు ఎక్కువగా జూనియర్ స్థాయి ఉద్యోగులకే పరిమితమై ఉన్నట్లు తెలుస్తోంది.

**ఇన్ఫోసిస్‌లోనూ బలమైన చెల్లింపులు**

ఇక మరో దేశీయ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ కూడా డిసెంబర్ 31, 2025తో ముగిసిన త్రైమాసికానికి సగటున 85 శాతం పనితీరు బోనస్ చెల్లింపులు విడుదల చేసింది. గత మూడున్నరేళ్లలో ఇది బలమైన వేరియబుల్ పే ఫలితంగా నిలిచింది.

## వివో నుంచి ప్రీమియం ఫోన్లు.. 'జీస్' ట్రిపుల్ కెమెరాతో..

**న్యూఢిల్లీ:** వివో ఇండియా తన 'వీ' సిరీస్ నుంచి 'వివో వీ70', 'వివో వీ70 ఎలైట్' పేర్లతో రెండు ప్రీమియం స్మార్ట్ ఫోన్లను భారతీయ మార్కెట్లోకి విడుదల చేసింది. ఫోటోగ్రఫీకి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చే 'వివో' ఈసారి కెమెరాలకు ప్రసిద్ధి చెందిన 'జీస్' సంస్థతో ప్రత్యేక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. రెండు ఫోన్లలోనూ జీస్ పార్ట్‌నర్‌షిప్‌తో కూడిన ట్రిపుల్ కెమెరా సెటప్ ఉంది. 50 మెగా పిక్సెల్(ఎంపీ) ప్రైమరీ కెమెరా, 50 ఎంపీ టెలి ఫొటోలెన్స్, 8 ఎంపీ అల్ట్రావైడ్ యాంగిల్ కెమెరా ఇచ్చారు. ఉత్తమ సెల్ఫీల కోసం ముందు భాగంలో 50 ఎంపీ జీస్ ఫ్రంట్ కెమెరా ఉంది. అల్యూమినియం ఫ్రేమ్, రౌండెడ్ కార్నర్లతో ప్రీమియం లుక్ ఇచ్చారు. వీటికి ఐపీ68, ఐపీ69 రేటింగ్ ఉండడంతో నీరు, దుమ్ము, ధూళి నుంచి రక్షణ లభిస్తుంది. 6.59 అంగుళాల అమోలెడ్ డిస్‌ప్లే ఇచ్చారు. 120హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేటుకు, 5000 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌కు సపోర్ట్ చేస్తాయి. ఈ రెండూ ఆండ్రాయిడ్ 16తో కూడిన ఆరిజన్ ఓఎస్6తో పనిచేస్తాయి. వీటికి ఆరేళ్ల సాఫ్ట్‌వేర్ సపోర్ట్ ప్రకటించింది. రెండు ఫోన్లలో భారీ 6500 ఎంఏహెచ్ బ్యాటరీ ఉంది. ఇది 90డబ్ల్యూ ఫ్లాష్‌ఛార్జ్‌కి సపోర్ట్ చేస్తుంది. ఒక్కసారి ఛార్జ్ చేస్తే 40 గంటల వీడియో ప్లేబ్యాక్ లేదా 11 గంటల నావిగేషన్ లభిస్తుందని కంపెనీ పేర్కొంది. హీట్ తగ్గించడానికి 'బైపాస్ ఛార్జింగ్' సౌకర్యం కూడా ఉంది. ఇందులో స్నాప్‌డ్రాగన్ 7 జెన్4 ప్రాసెసర్‌ను అందించారు. రోజువారీ పనులు, గేమింగ్‌కు అనుకూలంగా ఉంటుంది. రెండు వేరియంట్లలో లభిస్తుంది. 8జీబీ౦ 256జీబీ వేరియంట్ ధర రూ.45,999గా కంపెనీ నిర్ణయించింది. 12జీబీ౦ 256జీబీ వేరియంట్ రూ.49,999కు లభిస్తుంది ఇందులో శక్తివంతమైన క్వాల్కమ్ స్నాప్‌డ్రాగన్ 8ఎస్‌జెన్3 చిప్‌సెట్‌తో వస్తుంది. ఇది గేమింగ్, అధిక పనితీరుకు అనువుగా ఉంటుంది. మొత్తం మూడు వేరియంట్లలో లభ్యమవుతుంది. 8జీబీ౦ 256జీబీ వేరియంట్ ధరను రూ.51,999గా కంపెనీ పేర్కొంది. 12జీబీ౦ 256జీబీ వేరియంట్ ధర రూ.56,999, 12జీబీ౦ 512 జీబీ వేరియంట్ ధర రూ.61,999గా నిర్ణయించింది.ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యెస్ బ్యాంక్ కార్డులపై 10% వరకు డిస్కౌంట్ అందిస్తోంది. రూ.1,499 వివో ఇయర్ బడ్స్ ను ఉచితంగా పొందవచ్చు. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, వివో ఆన్‌లైన్ స్టోర్లలో లభిస్తున్నాయి.

## తగ్గనున్న వంటనూనెల ధరలు!



**న్యూఢిల్లీ :** వంటనూనెల ధరలు మరింత తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. క్రూడ్ వంటనూనెలపై దిగుమతి సుంకాన్ని 10 శాతం తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఈ నిర్ణయం మే 31 నుంచి అమల్లోకి రానున్నట్లు కేంద్ర సర్కార్ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో వెల్లడించింది. ప్రస్తుతం క్రూడ్ పామాయిల్, క్రూడ్ సోయా ఆయిల్, క్రూడ్ సన్‌ఫ్లవర్‌పై 20 శాతం దిగుమతి సుంకం విధిస్తున్నారు. దేశీయంగా వినియోగిస్తున్న వంటనూనెల్లో 70 శాతం దిగుమతులపై ఆధారపడుతున్నది. ప్రస్తుతం ఇండోనేషియా, మలేషియా, థాయ్‌లాండ్ దేశాల నుంచి అధికంగా పామాయిల్‌ను భారత్ దిగుమతి చేసుకుంటున్నది. అలాగే సన్‌ఫ్లవర్ ఆయిల్‌ను అర్జెంటీనా, బ్రెజిల్, రష్యా, ఉక్రెయిన్ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నది. కేంద్రం తీసుకున్న తాజా నిర్ణయంతో వంటనూనెల ధరలు మరింత తగ్గనున్నాయని, అలాగే డిమాండ్ కూడా మరింత పెరిగే అవకాశాలున్నాయని ఇండస్ట్రీ వర్గాలు వెల్లడించాయి. ఈ మూడు చమురులపై మొత్తం దిగుమతి సుంకం 27.5 శాతం నుంచి 16.5 శాతానికి దిగిరానున్నది. సెప్టెంబర్ 2024లో క్రూడ్, రిఫైన్ వంటనూనెలపై కస్టమ్స్ సుంకాన్ని 20 శాతానికి పెంచిన విషయం తెలిసిందే.

## ఫోక్స్‌వ్యాగన్ మరో కారు



హైదరాబాద్, ఫిబ్రవరి 21: ఫోక్స్‌వ్యాగన్ మరో లగ్జరీ కారును దేశీయ మార్కెట్‌కు పరిచయం చేసింది. ఎస్‌యూవీ విభాగాన్ని మరింత బలోపేతం చేసే ఉద్దేశంలో భాగంగా సంస్థ 'టేరాన్ ఆర్ లైన్' మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ కారు ప్రారంభ ధర రూ.46.99 లక్షలుగా నిర్ణయించింది. ఏడుగురు కూర్చోవడానికి వీలుండే విధంగా డిజైన్ చేసిన ఈ మాడల్ 2.0 లీటర్ల 4-సిలిండర్ టర్బో పెట్రోల్ ఈవీఓ4 ఇంజిన్‌తో రూపొందించింది. కేవలం 7.3 సెకండ్లలో 100 కిలోమీటర్లు ప్రయాణించనున్న ఈ కారు గంటకు 200 కిలోమీటర్లకు పైగా దూసుకుపోనున్నది. పానోరమిక్ సన్‌రూఫ్, రియర్ సన్ షేడ్స్, 15 ఇంచుల ఇన్ఫోటైన్‌మెంట్ స్క్రీన్, ఫుల్-డిజిటల్ కాక్‌పిట్, 9 ఎయిర్‌బ్యాగ్‌లు, 14 అటానమస్ ఫీచర్లతో రూపొందించింది.

## ప్రీమియం ఫీచర్లతో బడ్జెట్ ధరల్లో కొత్త స్మార్ట్ ఫోన్

చైనా మొబైల్ తయారీ సంస్థ ఇన్ఫినిక్స్ బడ్జెట్ ధరల్లో కొత్త స్మార్ట్ ఫోన్ తీసుకువచ్చింది.'ఇన్ఫినిక్స్ నోట్ ఎడ్జ్ 5జీ' పేరుతో భారత మార్కెట్‌లో విడుదల చేసింది. 6 జీబీ ర్యామ్, 128 జీబీ ఇంటర్నల్ స్టోరేజ్ వేరియంట్ ధర రూ. 21,999గా, 8 జీబీ ర్యామ్, 128 జీబీ ఇంటర్నల్ స్టోరేజ్ వేరియంట్ ధర రూ. 23,999గా, 8 జీబీ ర్యామ్, 256 జీబీ ఇంటర్నల్ స్టోరేజ్ వేరియంట్ ధర రూ. 25,999గా నిర్ణయించారు.

లాంచ్ ఆఫర్‌లో భాగంగా 12 నెలల సాధారణ వారెంటీతో పాటు 12 నెలల ఎక్స్‌టెండెడ్ వారెంటీ సదుపాయాన్ని కంపెనీ కల్పిస్తోంది. వన్‌టైమ్ స్క్రీన్ రీప్లేస్‌మెంట్ ఆఫర్‌ను కూడా అందిస్తోంది. ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంకు కార్డుల ద్వారా చేసే కొనుగోళ్లపై రూ.2 వేల వరకు అదనపు డిస్కౌంట్ లభిస్తుంది. ఫ్లిప్‌కార్ట్‌తో పాటు కంపెనీ వెబ్‌సైట్, ఆఫ్ లైన్ స్టోర్స్‌లో ఈ ఫిబ్రవరి 25నుంచి సేల్ అందుబాటులో ఉండనుంది. సిల్క్ ఫైబర్ ఫినిష్, స్టెల్లర్ బ్లూ, లూనార్ టైటానియం కలర్స్‌లో మూడు వేరియంట్లలో లభిస్తుంది. ఇందులో 6.78 అంగుళాల 1.5కే త్రీడీ కర్వ్డ్ అమోలెడ్ డిస్‌ప్లే, కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 7ఐ ప్రొటెక్షన్, మీడియాటెక్ డైమెన్సిటీ 7100 ప్రాసెసర్, ఐపీ65 వాటర్ అండ్ డస్ట్ రెసిస్టెన్స్ సర్టిఫికెట్, ఆండ్రాయిడ్ 16 ఆధారిత ఎక్స్‌ఓఎస్ 16 ఆపరేటింగ్ సిస్టం తదితర ఫీచర్లు ఉన్నాయి. వెనకవైపు 50 మెగా పిక్సెల్ మెయిన్ కెమెరాతో పాటు 8 మెగా పిక్సెల్ అల్ట్రా వైడ్ లెన్స్‌తో కూడిన డ్యుయల్ కెమెరా సెట్ అప్ ఉంది. ముందువైపు సెల్ఫీలు, వీడియో కాల్స్ కోసం 13 మెగా పిక్సెల్ సెల్ఫీ కెమెరా ఇచ్చారు. 6500 ఎంఏహెచ్ బ్యాటరీ ఉంది. 45డబ్ల్యూ ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయంతో వస్తోంది. 5జీ, డ్యూయల్ 4జీ వీఓఎల్ఈటీ కనెక్టివిటీ సపోర్టులున్నాయి. వై--ఫై, బ్లూటూత్ 5.4, జీపీఎస్, ఎన్ఎఫ్‌సీ ఉన్నాయి.




యూఎస్‌బీ టైప్--సీ పోర్ట్, ఐఆర్ సెన్సార్ ఉన్నాయి. ఇన్--డిస్‌ప్లే ఫింగర్ ప్రింట్ సెన్సార్‌లున్నాయి.

# స్పోర్ట్స్

## భళా అమ్మాయిలు.. ఆసియా కప్ కొల్లగొట్టిన టీమిండియా!

అంతర్జాతీయ క్రికెట్‌లో భారత అమ్మాయిలు వరుసగా ట్రోఫీలు పట్టేస్తున్నారు. నిరుడు హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిడియా తొలిసారి వన్డే వరల్డ్‌కప్ ఛాంపియన్‌గా అవతరించగా.. రాధా యాదవ్ బృందం మహిళల ఆసియా కప్ రైజింగ్స్ స్టార్స్‌లో విజేతగా నిలిచింది. సెమీఫైనల్లో శ్రీలంకను చిత్తు చేసిన టీమిండియా ఆదివారం జరిగిన ఫైనల్లో బంగ్లాదేశ్‌పై పంజా విసిరింది. ఓపెనర్లు విఫలమైనా తేజల్ హసబ్నీస్(51 నాటౌట్) అర్ధ శతకంతో.. రాధా యాదవ్(38) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో మెరవగా.. ప్రేమా రావత్(3-12) ధాటికి బంగ్లా కుప్పకూలింది. 46 పరుగుల తేడాతో ప్రత్యర్థిని మట్టికరిపించిన భారత్ టైటిల్ కొల్లగొట్టింది. సెమీఫైనల్లో భారీ విజయంతో శ్రీలంకను ఇంటికి పంపిన భారత ఏ జట్టు ఫైనల్లోనూ చెలరేగింది. అజేయంగా టైటిల్ పోరుకు దూసుకొచ్చిన బంగ్లాదేశ్‌ను ఆల్‌రౌండ్ షోతో దెబ్బతీసింది. శుభారంభం దక్కకపోయినా తేజల్ హసబ్నీస్(51 నాటౌట్) హాఫ్ సెంచరీతో చెలరేగగా.. రాధా యాదవ్(38) కీలక ఇన్నింగ్స్ ఆడింది. ఐదో వికెట్‌కు వీరు 69 రన్స్ జోడించి పరువు కాపాడారు. 135 పరుగుల ఛేదనలో బంగ్లాదేశ్‌ను భారత బౌలర్లు వణికించారు.




**అటు ప్రేమ.. ఇటు తనూజ**

టీమిండియా నిర్దేశించిన ఛేదనలో బంగ్లాదేశ్ ఏ దశలోనూ లక్ష్యం దిశగా సాగలేదు. ఓపెనర్ ఇష్మా తంజిమ్(3)ను ఔట్ చేసిన సైమా థాకొర్ వికెట్ల వేటకు తెరసింది. షమీమా సుల్తానా(20)ను వెనక్కి పంపిన ప్రేమా రావత్(3-21) ప్రత్యర్థిని మరింత దెబ్బతీసింది. రాధా యాదవ్ ఓవర్లో షర్మీన్ సుల్తానా(18) డగౌట్ చేరగా.. ప్రమాదకరమైన సదియా అక్తర్(10), లతా మొండల్(1)ను ఔట్ చేసిన ప్రేమ మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పింది. మరో ఎండ్‌లో తనూజ కన్వర్(2-11) సైతం చెలరేగగా బంగ్లా కోలుకోలేకపోయింది. షోఫియా ఖాతూన్(9)ను తనూజ ఔట్ చేయగా బంగ్లా 88 పరుగులకే ఆలౌటయ్యింది.

## పాకిస్తాన్ సూపర్ లీగ్‌లోకి మరో సౌతాఫ్రికా క్రికెటర్

పాకిస్తాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్) 2026లోకి మరో సౌతాఫ్రికా క్రికెటర్ చేరాడు. ఈ లీగ్‌లో ఇప్పటికే చాలామంది సౌతాఫ్రికా ఆటగాళ్లు పాల్గొంటుండగా.. తాజాగా యువ వికెట్‌కీపర్ బ్యాటర్ రూబిన్ హెర్మన్ వీరి సరసన చేరాడు. హెర్మన్‌ను లాహోర్ ఖలందర్స్ ఫ్రాంచైజీ సొంతం చేసుకుంది. ఖలందర్స్‌తో జతకట్టిన అనంతరం హెర్మన్‌కు ఓ ప్రత్యేక గుర్తింపు దక్కింది. ఫాఫ్ డుప్లెసిస్ తర్వాత ఖలందర్స్‌కు ప్రాతినిథ్యం వహించిన రెండో సౌతాఫ్రికన్‌గా హెర్మన్ గుర్తింపు పొందాడు. గతేడాది చివర్లో డుప్లెసిస్ ఐపీఎల్ వేలం నుంచి తప్పుకొని పీఎస్ఎల్‌లో చేరాడు. 14 ఏళ్ల ఐపీఎల్ కెరీర్‌లో దాదాపు 4,800 పరుగులు చేసిన డుప్లెసిస్, పీఎస్ఎల్ ఆడటం అప్పట్లో సంచలనం. ఈ ఏడాది ఐపీఎల్ విండోలో మరో సౌతాఫ్రికా ఆటగాడు పీఎస్ఎల్‌లో పాల్గొంటుండటం ఆసక్తికరం. 29 ఏళ్ల హెర్మన్ జూఎస్ఏ టీ20 ఛాలెంజ్ 2023-24లో 436 పరుగులు చేసి తొలిసారి వెలుగులోకి వచ్చాడు. ఆతర్వాత ఎస్ఏ20లో పార్ల్ రాయల్స్ తరపున ఆడాడు. 2025 ఎడిషన్‌లో సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్‌పై ఒత్తిడిలో 81లి పరుగులు చేసి ప్రతిభను చాటుకున్నాడు. ఆ ఎడిషన్‌లో 226 పరుగులు చేశాడు. మొత్తం టీ20 కెరీర్‌లో హెర్మన్ 1,497 పరుగులు చేశాడు. ఇందులో ఓ శతకం, 8 అర్ధ శతకాలు ఉన్నాయి.




**లాహోర్ జట్టు వ్యూహం**

లాహోర్ జట్టు ఇప్పటికే ఫఖర్ జమాన్, హారిస్ రౌఫ్, ఉసామా మిర్, హసీబుల్లా ఖాన్ వంటి స్థానిక ఆటగాళ్లను కలిగి ఉంది. హెర్మన్ చేరికతో ఆ ఫ్రాంచైజీ బ్యాటింగ్ బలం మరింత పెరుగనుంది. హెర్మన్ మిడిలార్డర్‌లో కీలకమైన బ్యాటర్. అతన్ని 5 లేదా 6వ స్థానంలో ఉపయోగించుకోవచ్చు. స్ట్రైక్ రొటేట్ చేయడం, డెత్ ఓవర్లలో బౌండరీలు కొట్టడం హెర్మన్ ప్రత్యేకత.

## స్పిన్ వ్యూహానికి శ్రీలంక చిత్తు.. సూపర్ 8లో ఇంగ్లండ్ బోణీ..!




స్వదేశంలో స్పిన్ అస్త్రంతో ప్రత్యర్థులను దెబ్బతీయాలనుకున్న శ్రీలంకకు ఇంగ్లండ్ పెద్ద షాకిచ్చింది. పల్లెకెల్ స్టేడియంలో విల్ జాక్స్(3-22) తిప్పేయగా.. పవర్ ప్లేలోనే కష్టాల్లో పడిన లంక.. ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. 150 పరుగుల ఛేదనలో టాపార్డర్, మిడిలార్డర్ చేతులెత్తేయగా.. కెప్టెన్ దసున్ శనక(30) పోరాడినా సరిపోలేదు. తడబడుతూ సాగిన ఆతిథ్య జట్టు ఇన్నింగ్స్‌కు ఆదిల్ రషీద్(2-13) తెరదించగా.. 51 పరుగుల తేడాతో గెలుపొందిన ఇంగ్లండ్ అదిరే బోణీ కొట్టింది. సొంతగడ్డపై చెలరేగాలనుకున్న శ్రీలంకను ఇంగ్లండ్ స్పిన్ అస్త్రంతో పడగొట్టింది. సూపర్ 8లో లంక నుంచి స్పిన్ ముప్పును ఊహించిన హ్యారీ బ్రూక్ సేన అందుకు తగ్గట్టే సన్నద్ధమైంది. కానీ.. తీరా మైదానంలోకి దిగాక ఫిల్ సాల్ట్(62) ఒక్కడే రాణించగా ప్రత్యర్థికి 150 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఫేవరెట్ లంక తమకు కొట్టినపిండి అయిన పల్లెకెలె స్టేడియంలో అలవోకగా గెలుస్తుందని అభిమానులు అనుకున్నారు. కానీ, పవర్ ప్లేలోనే ఇంగ్లండ్ విజయం దిశగా నడిచింది.

**34కే ఐదు వికెట్లు**

డేంజరస్ ఓపెనర్ పథుమ్ నిశాంక(9)ను రెండో ఓవర్లోనే ఔట్ చేసి జోఫ్రా ఆర్చర్(2-20) తొలి బ్రేకివ్వగా.. అక్కడి నుంచి విల్ జాక్స్(3-22)తన స్పిన్ మ్యాజిక్ చూపించాడు. రిటర్న్ క్యాచ్‌తో కుశాల్ మెండిస్(4)ను వెనక్కి పంపిన అతడు.. పవన్ రత్ననాయకే(0), దునిత్ వెల్లలాగే(10)లను వెనక్కి పంపి ఆతిథ్య జట్టును కష్టాల్లోకి నెట్టాడు. పవర్ ప్లే చివరి ఓవర్లో రెండు ఫోర్లు బాదిన వెల్లలాగే.. మిడాఫ్‌లో షాట్‌కు యత్నించి బ్రూక్ చేతికి చిక్కడంతో... 34కే లంక ఐదు కీలక వికెట్లు కోల్పోయింది. సగం వికెట్లు పడిన వేళ కెప్టెన్ దసున్ శనక(30)తో కలిసి జట్టును ఆదుకోవాలనుకున్న కమిందు మెండిస్(13).. డాసన్ వేసిన 9వ ఓవర్లో సిక్సర్ బాదాడు. కానీ, బంతికి రిటర్న్ క్యాచ్ ఇచ్చి లంక కష్టాలను మరింత పెంచాడు. శనకకు తోడుగా నిలిచే వారు కరువయ్యారు. ఓవర్టన్ ఓవర్లో హేమంత అనూహ్యంగా బ్యాట్‌ను వికెట్లకు తాకించి వెనుదిరిగాడు. అప్పటికే అవసరమైన నెట్‌రన్ రేటు పది దాటడంతో.. పెద్ద షాట్లు ఆడే క్రమంలో ఆదిల్ రషీద్(2-11) ఓవర్లో శనక వికెట్ ఇచ్చేశాడు. అతడు ఔటయ్యాక 13 పరుగులకే శ్రీలంక ఇన్నింగ్స్‌కు రషీద్ తెరదించాడు. ఆల్‌రౌండ్ షోతో ఆతిథ్య జట్టుకు చెక్ పెట్టిని ఇంగ్లండ్ 51 పరుగులతో గెలుపొంది.. గ్రూప్ బీలో బోణీ కొట్టింది.

**సాల్ట్ ఒక్కడే**

సూపర్ 8 తొలి పోరులో ఇంగ్లండ్ ఆరంభంలో తడబడినా పోరాడగలిగే స్కోర్ చేసింది. శ్రీలంక స్పిన్నర్లు దునిత్ వెల్లలాగే(3-26), థీక్షణల(2-21)లు అద్భుతంగా కట్టడి చేయడంతో టాపార్డర్, మిడిలార్డర్ తేలిపోయింది. ఓవైపు వికెట్లు పడుతున్నా ఓపెనర్ ఫిల్ సాల్ట్(62) ఒత్తిడిలోనూ అర్ధ శతకంతో మెరిశాడు. ఆఖర్లో విల్ జాక్స్(13), జేమీ ఓవర్టన్(10 నాటౌట్)లు దూకుడుగా ఆడడంతో ఇంగ్లండ్ నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 150 పరుగులు చేసింది.

# హనుమంతుడి జన్మస్థలంలో గ్రాండ్‌గా మొదలైన 'జై హనుమాన్' రిషబ్ శెట్టితో భారీ సీక్వెల్!



విజయనగర సామ్రాజ్య పుణ్యక్షేత్రం, హనుమంతుడి జన్మస్థలంగా భావించే హంపిలోని అంజనాద్రి బెట్ట సాక్షిగా 'జై హనుమాన్' చిత్రానికి ఆదివారం అత్యంత వైభవంగా పూజా కార్యక్రమాలు జరిగాయి. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వస్తున్న ఈ భారీ సీక్వెల్‌ను మైత్రీ మూవీ మేకర్స్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. ఈ వేడుకలో చిత్ర బృందంతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. గత ఏడాది కాలంగా రణవీర్ సింగ్ ప్రాజెక్ట్ వంటి ఇతర పరిణామాల వల్ల ఈ సినిమా ఆలస్యమైనప్పటికీ, నేటి పూజా కార్యక్రమాలతో పనులు అధికారికంగా ఊపందుకున్నాయి. ఈ చిత్రంలో హనుమంతుడి పాత్రలో 'కాంతార' ఫేమ్ రిషబ్ శెట్టి నటిస్తుండగా, రానా దగ్గుబాటి ఒక కీలక పాత్రలో మెరవనున్నారు. మొదటి భాగం హీరో తేజ సజ్జా కూడా ఈ సినిమాలో భాగం కావడం విశేషం. పాన్ ఇండియా స్థాయిలో భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ 2026 మార్చి లేదా ఏప్రిల్ నెలల్లో ప్రారంభం కానుంది. మొదటి భాగం కంటే విజువల్స్ పరంగా అద్భుతంగా ఉండేలా 'అంజనాద్రి 2.0' పేరుతో సరికొత్త ప్రపంచాన్ని దర్శకుడు ప్రశాంత్ వర్మ సిద్ధం చేస్తున్నారు. భక్తి, యాక్షన్ కలగలిపి ఈ చిత్రాన్ని అద్భుత దృశ్యకావ్యంగా మలిచేందుకు చిత్ర యూనిట్ సన్నద్ధమవుతోంది.



# ఈ అవార్డ్ వారికే అంకితమిస్తున్నా: అల్లు అర్జున్

పుష్ప-2 మూవీకి ఉత్తమ నటుడిగా ఫిల్మ్ ఫేర్ అవార్డ్ రావడంపై ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ స్పందించారు. ఇంత అద్భుతమైన గౌరవం ఇచ్చినందుకు ఫిల్మ్‌ఫేర్‌కు ధన్యవాదాలు తెలిపారు. నన్ను ఇంతలా ప్రేమించే దేశంలో అవార్డ్ స్వీకరించడం చాలా ఆనందంగా ఉందన్నారు. మీ అందరి ప్రేమ, ఆశీర్వాదాలకు తానెప్పుడు విధేయుడినని ట్వీట్ చేశారు. ఈ అవార్డ్‌ను హద్దుల్లేని నా అభిమానుల ప్రేమకు అంకితం చేస్తున్నట్లు బన్నీ ప్రకటించారు. కాగా..కేరళలోని కొచ్చిన్‌లో జరిగిన 70వ ఫిల్మ్ ఫేర్ అవార్డ్స్‌లో ఐకాన్‌స్టార్ ఉత్తమ నటుడిగా అవార్డ్ అందుకున్నారు. 2024లో విడుదలైన పుష్ప-2 చిత్రానికి ఈ ఘనత సొంతం చేసుకున్నారు. ఈ చిత్రానికి ఉత్తమ దర్శకుడిగా సుకుమార్, బెస్ట్ మ్యూజిల్ ఆల్బమ్‌కు దేవీశ్రీ ప్రసాద్, ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్ విభాగంలో రామకృష్ణ అండ్ మోనిక అవార్డులు అందుకున్నారు. అంతేకాకుండా 2024లో ఉత్తమ చిత్రంగా పుష్ప-2 నిలిచింది. ఈ చిత్రం తెలుగు ఇండస్ట్రీలో అత్యధికంగా ఐదు విభాగాల్లో ఫిల్మ్ ఫేర్ అవార్డులు కొల్లగొట్టింది.



# సోషల్ మీడియా ట్రోలింగ్.. సామ్ రియాక్షన్ ఇదే!

దర్శకుడు రాజ్ నిడిమోరును పెళ్లి చేసుకున్నాక సమంత ముఖం వెలిగిపోతోంది. ఒకప్పుడు విచారంగా కనిపించే తన ముఖం ఇప్పుడు వెయ్యి ఓట్ల బల్బులా ప్రకాశిస్తోంది. ప్రస్తుతం సంతోషకర జీవితం గడుపుతున్న సామ్ మా ఇంటి బంగారం అనే చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. పెళ్లి తర్వాత ఆమె నుంచి వస్తున్న మొదటి సినిమా ఇదే కావడం విశేషం! ఈ చిత్రం మే 15న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

**ఏదీ నన్ను కదిలించలేదు**

ఇదిలా ఉంటే తాజాగా తను సోషల్ మీడియాలో అభిమానులతో చిట్‌చాట్ చేసింది. ఫ్యాన్స్ అడిగిన పలు ప్రశ్నలకు ఓపికగా సమాధానాలిచ్చింది. సోషల్ మీడియాలో వచ్చే ప్రశంసలు, విమర్శలపై మీరు ఎలా స్పందిస్తారు? అని ఓ వ్యక్తి అడిగారు. అందుకు సమంత స్పందిస్తూ.. ప్రశంసలు నన్ను కదిలించలేవు. అలాగే విమర్శలు కూడా నన్ను ఎఫెక్ట్ చేయవు. కానీ, నెగెటివిటీని నా ఇంటివరకు తీసుకొస్తే మాత్రం మిమ్మల్ని బ్లాక్ చేస్తాను.

**దానర్థం అదే..**

అలా నా స్పేస్‌ను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకుంటాను. మిమ్మల్ని బ్లాక్ చేశానంటే నేను బాధపడ్డానని కాదు. మీలాంటివారికి నాదగ్గర చోటు లేదని అర్థం అని రిప్లై ఇచ్చింది. మీలోని ఓ ఫన్నీ థింగ్ ఏంటని అడగ్గా.. కిందపడి మరీ నవ్వుతానంది. ఎక్కువ బాధ లేదా ఒత్తిడికి గురైనప్పుడు ఏం చేస్తారని అడగ్గా.. ధ్యానం చేస్తానని బదులిచ్చింది.

**సినిమా**

మా ఇంటి బంగారం సినిమా విషయానికి వస్తే.. ఇందులో సమంత పెళ్లయిన అమ్మాయిగా కనిపించనుంది. అలాగే ఆపద వచ్చినప్పుడు కత్తి పట్టేందుకు కూడా వెనుకాడని శివంగిగానూ అలరించనుంది. గుల్షన్ దేవయ్య కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి నందిని రెడ్డి దర్శకత్వం వహించింది.



# నిరాశపర్చిన రాజాసాబ్.. పీపుల్ మీడియా ఫ్యాక్టరీకి ప్రభాస్ మరో ఛాన్స్.. !

గ్లోబర్ స్టార్ యాక్టర్ ప్రభాస్ రీసెంట్‌గా రాజాసాబ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడని తెలిసిందే. టాలీవుడ్ టాప్ లీడింగ్ బ్యానర్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ తెరకెక్కించిన ఈ చిత్రం బాక్సాఫీస్ ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఇంప్రెస్ చేయలేకపోయింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ మూవీ పీపుల్ మీడియా ఫ్యాక్టరీకి నిరాశనే మిగిల్చిందని చెప్పాలి. ఇదిలా ఉంటే ప్రభాస్ మరోసారి ఇదే బ్యానర్‌లో సినిమా చేసేందుకు రెడీ అవుతున్నాడన్న వార్త ఒకటి నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఫెయిల్యూర్ తర్వాత ప్రభాస్ నిర్మాత టీజీ విశ్వప్రసాద్‌ను కలిసి మరో సినిమా చేస్తానని హామీనిచ్చాడట. బాక్సాఫీస్ ఫలితాలతో సంబంధం లేకుండా ప్రభాస్ తీసుకున్న ఈ నిర్ణయం మరోసారి తన గొప్ప మనసును చాటుతోంది. ప్రభాస్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ రీయూనియన్ ప్రాజెక్టుకు సంబంధించి త్వరలోనే అధికారిక ప్రకటన రాబోతుందట. మరి ఈ సినిమాను డైరెక్ట్ చేయబోయేది ఎవరో..? ప్రభాస్ స్టార్‌డమ్‌కు తగ్గకుండా ఎలివేట్ చేసేలా ఈ కొత్త ప్రాజెక్టు ఉండాలని ఆశిస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఎప్పుడెప్పుడు అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఉంటుందా..? అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు మూవీ లవర్స్. ప్రభాస్ ఖాతాలో ప్రస్తుతం సలార్ 2తోపాటు ఫౌజీ, స్పిరిట్ సినిమాలున్నాయి.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com